ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33.0

కనిష్ఠం : 25.0

కొండలరావుపాలెంలో

ఉద్రిక్తత

- వైసీపీ శ్రేణులు.. కొల్లేరు వాసుల మధ్య ఘర్షణ

■ లోపలి పేజీలో..



వంగాయగూడెం-కొత్తూరు రహదారి దుస్థితి

ఇవి రోడ్లేనా..

- మళ్లీ దెబ్బతిన్న రహదారులు
- ఎటు చూసినా గుంతలమయమే
- ఇక్కడ ప్రయాణమే ఓ నరకం
- ఇప్పటికే చేతులెత్తేస్తున్న ప్రభుత్వ శాఖలు
- గతంలో మాదిరిగానే సీన్ రిపీట్
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో తేలిన వాస్తవాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రోడ్ల కథ మళ్లీ మొదటికొచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్ల గడప దాటి రోడ్డెక్కాలంటే గుండె గుభేల్‌మనేది. వరుస ప్రమాదాలతో క్షతగాత్రులు, మృతుల సంఖ్య అధికంగా ఉండేది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతలు తేలిన రోడ్ల మరమ్మతులకు నిధులను విడుదల చేసింది. 100 రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి చేయాల్సిందిగా లక్ష్యాలను నిర్దేశించింది. ఆర్‌అండ్‌బీ పరంగా కొన్నిరోడ్లు, మరిన్ని సిమెంటు రోడ్లుగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేసింది. ఇంతచేసినా అడపా దడపా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్ల పరిస్థితి మళ్లీ అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహనాలు ముందుకు కదల్లేని స్థాయిలో రోడ్లన్నీ దెబ్బ తిన్నాయి. గతంలో పూడ్చినవి కాకుండా ఇప్పుడు కొత్తగా దెబ్బ తిన్న రోడ్లే అత్యధికం. ప్రత్యేకించి చిన్న, చిన్న మరమ్మతులు చేయడం.. మరవడం అతి పెద్ద తప్పిదంగా మారింది. ఇప్పుడు ఏ మార్గంలో ప్రయాణించాల్సి ఉన్న గుంతలు దాటి గట్టెక్కాల్సిందే. జిల్లావ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ ఇదే అతి పెద్ద ప్రధాన సమస్య. ప్రజల నుంచి వెలువడుతున్న ఫిర్యాదులు ఈ సమస్య మీదే. వారం రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్ల పరిస్థితి మరింత హీనస్థాయికి చేరింది. మారుమూల పల్లెల్లో రహదారుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. పట్టణ శివార్లలోను ఇదే పరిస్థితి. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు అందుకు భిన్నంగా స్పందనే కరువు. ఫలితంగా ఎండా కాలంలోనే రోడ్లు గానీ.. వర్షాకాలంలో కానే కావు అనేలా మారిన రహదారుల దుస్థితి.. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గురువారం 'ఆంధ్రజ్యోతి' బృందం నిర్వహించిన విజిట్‌లో విస్తుపోయే సమస్యలెన్నో వెలుగుచూశాయి.

■ లోపలి పేజీలో..

కొత్త ముహూర్తం!



- వచ్చే నెలలో పక్కా ఇళ్లు ఇస్తారట..
- ఇప్పటికే పదేపదే మారిన తేదీలెన్నో..
- సొంతింటి కోసం పేదల ఆరాటం
- జగన్ కాలనీల్లో అన్నీ కష్టాలే
- వీటిని అధిగమించేలా సరికొత్త నిర్ణయం
- 30 వేల ఇళ్లల్లో ప్రవేశాలకు అనుకూలత

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయ్యింది. ఈ మధ్యకాలంలో టిడ్కో ఇళ్ల పేదల పరం చేస్తామని కొన్నాళ్లు.. పక్కా గృహాల్లో పేదలకు గృహ ప్రవేశాలు చేస్తామని ఇంకోసారి పేదలను ఊరిస్తూ వచ్చారు. ఇదిగో మళ్లీ ఇంకో ముహూర్తం వచ్చే నెలలో మీరంతా సొంతింట్లో చేరేలా.. మంత్రుల ప్రకటన. ఊరించి.. ఊరించి ఏళ్లు గడిచిపోయాయి. ఈసారికైనా ముహూర్తం సాకారమవుతుందా ? జగన్ జమానాలో కొత్త ఇళ్లు సంగేతేమో గానీ టిడ్కో ఇళ్లను పాడుబెట్టారు. అప్పట్లో జగనన్న కాలనీలను గొప్పగా నిర్మిస్తామని చెప్పి.. వేలల్లో ఇళ్ల నిర్మాణం సాగుతుందని గప్పాలు కొట్టి మరీ చెప్పారు. ఇంత చేస్తే ఒకటో, అరో తప్ప అన్ని కాలనీల్లోను అప్పట్లో నిర్మాణాలు పూర్తికాలేదు. గత ఎన్నికలకు ముందు ఈ పక్కా ఇళ్లన్నీ మీ సొంతం గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండంటూ నాటి వైసీపీ కేడర్ హడావుడి చేసింది. జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లలో అనేకం మౌలిక సదుపాయాలకు, గృహ ప్రవేశాలకు నోచుకోలేదు. అనంతరం అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం సాధ్యమైనంత మేర అప్పటికే నిర్మాణం పూర్తయిన పక్కా ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సమాయత్తమైంది. వీలైతే టిడ్కో ఇళ్లల్లో గృహ ప్రవేశాలకు సంసిద్ధమైంది. అనుకోని అవాంతరాలు తలెత్తడంతో గృహ ప్రవేశాల ముహూర్తం పదేపదే వాయిదా పడుతూ వచ్చింది. జగనన్న కాలనీలను ఎన్టీఆర్ కాలనీలుగా మార్చేశారు. ఇదే దశలో పీఎంఈవై పట్టణ, గ్రామీణ స్కీముల్లో భాగంగా పూర్తయిన ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని భావించారు.

మరోసారి ముహూర్తం

ఏళ్ల తరబడి పేదల సొంతింటి కల నిజం చేసేందుకు పదే, పదే ప్రయత్నిస్తూనే ఉన్నారు. తాజాగా ప్రభుత్వం వచ్చే నెలలో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లన్నింటిని పేదలపరంగా చేయడమే కాకుండా, వారంతా గృహ ప్రవేశాలకు అనుగుణంగా అన్ని సిద్ధం చేస్తామని కీలక ప్రకటన చేసింది. మంత్రులు కొలుసు పార్థసారథి, నారాయణ ప్రభుత్వ నిర్ణయాలను ప్రకటిస్తూనే సాధ్యమైనంత మేర వచ్చే నెలలో ఈ ప్రక్రియ కొనసాగేలా చూస్తామని ప్రకటించి పేదల్లో మళ్లీ ఆశలు రేపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎన్టీఆర్ కాలనీల్లో 30 వేలకుపైగా ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన విధంగా కనీసం శ్రావణ మాసం తర్వాత అయినా గృహ ప్రవేశాలు జరిగితే అదే పది వేలని పేదలు కొంత మేర సంబరపడుతున్నారు. ఇంకోవైపు (మిగతా 8వ పేజీలో)

ఒకటా, రెండా.. లక్ష ఇళ్లు

జగన్ హయాంలో జిల్లావ్యాప్తంగా కేంద్రం సమకూర్చిన పీఎంఈవై గృహాలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ పక్షాన అదనంగా లబ్ధిదారులకు లక్ష ఇళ్లు అందించాలని లక్ష్యంగా తీసుకున్నారు. ప్రతీ నియోజకవర్గంలోను నిర్మించిన కాలనీల్లో అనేక ఇళ్లు సిద్ధమయ్యాయి. చివరి దశకు వచ్చి నిలిచిన ఇళ్లను తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంపూర్తి చేశారు. ఇలా పూర్తయిన 30 వేల ఇళ్లకు పైగా చాలా కాలంగా గృహ ప్రవేశాలకు ఎదురుచూస్తూనే ఉన్నాయి. జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి హడావుడిగా ఎవరైతే లబ్ధిదారులు ఉన్నారో, వారంతా మహిళా గ్రూపులకు చెందిన వారైతే రూ.30 వేలు డీడీల రూపంలో చెల్లిస్తే పక్కా ఇళ్ల నిర్మాణానికి ఓకే చేస్తామని పరుగులు పెట్టించారు. గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న వారంతా రెండేళ్ల క్రితమే రూ.30 వేలు చెల్లించినా ఇప్పటి వరకు వారు ఆశించినట్లు నిర్మాణాలైతే సాగ లేదు. తాము కట్టిన సొమ్ములనైనా వెనక్కి ఇవ్వాలని పదే పదే డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అదీ తీరలేదు. ప్రస్తుతం ఉన్న కాలనీల్లోనే అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి.



కుక్కునూరులో పోటెత్తిన గోదావరి వరద

- వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు బంద్
- పత్తిచేలు మునక.. పడవపై ప్రయాణించి ముంపువాసులతో మాట్లాడిన కలెక్టర్, జేసీ

జల దిగ్బంధం

కుక్కునూరు/వేలేరుపాడు,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువకు వస్తున్న వరద నీటితో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. భద్రాచలం నుంచి దిగువకు 13 లక్షల 60 వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో దీనికి అదనంగా శబరి వరద తోడవడంతో వేలేరుపాడు మండలంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వేలేరుపాడు, కోయిదా రహదారి, వేలేరుపాడు, రుద్రమ్మకోట, రేపాకగొమ్ము ప్రధాన రహదారి మునగడంతో అధికారులు ప్రజలను తరలించేందుకు లాంచీలను ఏర్పాటు చేశారు. కుక్కునూరు మండలంలోని పలుచోట్ల పత్తి పంటలు నీటమునిగాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

వేలేరుపాడు మండలంలోని ముంపు గ్రామాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత చిగురుమామిడికి జేసీ ధాత్రిరెడ్డితో కలిసి బోటుపై ప్రయాణించి గ్రామస్థులతో మాట్లాడారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశామని తెలిపారు. బాధిత ప్రాంతాల ప్రజలకు చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కుక్కునూరులోని దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు 150 కుటుంబాలను తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ముంపు గ్రామాలైన గొమ్ముగూడెం, లచ్చిగూడెం, ప్రజలను దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించామన్నారు. ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఫిషరీష్ డీడీ నర్సయ్య, ఎంపీడీవో శ్రీహరి ఉన్నారు. దాచారం పునరావాస కాలనీలో జేసీ ధాత్రిరెడ్డి పర్యటించారు. వరద బాధితులకు బియ్యం, వంట సామగ్రి, కాయగూరలు, అందజేశారు. లచ్చిగూడెం, కౌండిన్యముక్తి గ్రామాల్లో జేసీ పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు.



చిగురుమామిడిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి



పోలవరం మండలంలో నీటమునిగిన పంటపొలాలు

నీటమునిగిన కడెమ్మ స్లూయిజ్ గేట్లు

పోలవరం : అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గురువారం సాయంత్రానికి గోదావరిలో నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వున్న ఇసుక తిన్నెలు, కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీట (మిగతా 8వ పేజీలో)

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోండి

- వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఏలూరు కార్యాలయం భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం భౌతికంగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని.. భవనం విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని పురపాలకశాఖ అధికారులకు స్పష్టం చేసింది. విచారణను సెప్టెంబరు 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరులోని వైసీపీ కార్యాలయం భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేలా పురపాలకశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది ఏఎస్ఎస్ బోస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ దరఖాస్తు పెండింగ్‌లో ఉందని.. భవనం నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

బార్‌లకు నామినేషన్లు నిల్

ఏలూరు,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌ల లైసెన్సులకు మూడోరోజు కూడా దరఖాస్తులు దాఖలు కాలేదు. జిల్లాలో 18 బార్లకు సంబంధించి ఈనెల 18న గెజిట్, లైసెన్సులకు నోటిఫికేషన్‌లను జారీ చేశారు. నిర్వహణా భారం, ఇతరత్రా కారణాల వల్ల దరఖాస్తుదారుల్లో కొంత స్తబ్ధత ఏర్పడిందని చెబుతున్నారు. ఓపెన్ కేటగిరి బార్‌లకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. ఇదిలా ఉండగా కల్లుగీత వర్గాలకు కేటాయించిన రెండు బార్లకు కూడా దరఖాస్తులు రాలేదు. దీనికి 29వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉంది. చివరి రెండు రోజుల్లోనే బార్‌లకు దరఖాస్తులు దాఖలవుతాయని అధికారులు భావిస్తున్నారు.



ఏలూరులో ప్రయాణికురాలి జీరో టిక్కెట్‌ను పరిశీలిస్తున్న డీపీటీవో షేక్ షబ్నం

జర్నీ..జోరు

ఆరు రోజులు.. 2,07,451 మంది మహిళలు ఉచిత ప్రయాణం

- జీరో టిక్కెట్ విలువ రూ.71.23 లక్షలు
- అధికారుల తనిఖీలు ముమ్మరమే

తేదీ	ప్రయాణికుల సంఖ్య	జీరో టిక్కెట్ విలువ
15	2,781	93,985
16	29,136	11,09,045
17	39,745	14,84,750
18	47,227	17,59,410
19	38,760	13,57,230
20	49,802	17,27,950
	2,07,451	71,23,370

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాలు జోరందుకున్నాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ నెల 15న మూడు డిపోల పరిధిలో 177 బస్సులు 62 రూట్లలో ఉచిత ప్రయాణాలు సాగాయి. వారం తిరగకముందే రెండు లక్షల మందిపైనే ఉచిత ప్రయాణాలు చేశారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు గణాంకాలను పరిశీలిస్తే జీరో టిక్కెట్ విలువ కింద 71లక్షల23వేల370 రూపాయల మేర ప్రయాణాల భారం లెక్కగట్టారు. ప్రస్తుతానికి నెలరోజులు ఈ ప్రయాణాలతీరు,తెన్నులు చూసి, ఆపై బస్సులు పెంచడమా, ఆర్టీసీ ఆదాయం వేరే మార్గాల్లో ఎలా పెంచాలనే దానిపై కసరత్తులు చేస్తారని సమాచారం. ఇదిలా ఉండగా ప్రయాణాల్లో మహిళలు విధిగా ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు ఒరిజనల్స్ ఉంటే అనుమతించే దిశగా కండక్టర్లు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు కొత్త, పాత బస్టాండ్‌ల్లో ఉచిత బస్సు ప్రయాణాల్లో మహిళల టిక్కెట్ల వ్యవహారమై తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతి : ఎస్పీ

■ లోపలి పేజీలో..

అంతా గప్‌చిప్!



- నూజివీడు నియోజకవర్గంలో అక్రమ క్వారీలపై మంత్రి కొలుసు దృష్టి
- రూ.మూడు కోట్లు పెనాల్టీని ఎందుకు రికవరీ చేయలేదు..
- అధికారులను ప్రశ్నించిన మంత్రి
- వైసీపీ హయాంలో దర్జాగా అక్రమ తవ్వకాలు

నూజివీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 2/1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిందని వివిధ శాఖల అధికారులతో కూడిన జాయింట్ కమిటీ నిర్ధారించి మూడు కోట్ల 10లక్షల రూపాయల పెనాల్టీని విధించింది. 2022 ఏప్రిల్ 13న కమిటీ విచారణ జరిపి 2022 మే 11వ తేదీన అక్రమ తవ్వకాలు నిజమేనని తేల్చి పెనాల్టీ విధించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పెనాల్టీని అధికారులు వసూలు చేయలేదు. ఏ చర్యలు చేపట్టలేదు. ఈవిషయాన్ని గత సోమవారం ఏలూరులో జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ప్రశ్నించారు. దీంతో ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అంతేకాదు నియోజకవర్గంలో అక్రమ తవ్వకాల తేనె తుట్టే కదిపినట్లయింది.

పెనాల్టీలోనే ట్విస్ట్

పూర్వాపరాల్లోకి వెళితే అధికారులు విధించిన పెనాల్టీలోనే ట్విస్ట్ కనిపిస్తోంది. ఈసర్వే నెంబర్లు భూమి ప్రభుత్వానిది. ఈ గట్టులో 55 923.288 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తరలించినట్టు విచారణలో అధికారులు నిర్ధారించారు. విచారణ చేసిన కమిటీలు మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మైనింగ్ సర్వేయర్, తోటపల్లి గ్రామ రెవెన్యూ సర్వేయర్, తహసీల్దార్ తదితరులు ఉన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూమి నుంచి తరలించిన ఈ గ్రావెల్ విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం మూడు కోట్ల పది లక్షల 3వేల 872 రూపాయలుగా లెక్క కట్టి తోటపల్లికి చెందిన కే బాబురావు అనే వ్యక్తికి అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇతను ఈ అక్రమ మైనింగ్ చేసిన వారి వద్ద వాచ్‌మెన్‌గా ఉండేవాడని సమాచారం. అక్రమ తవ్వకాలు జరిపిన వారికి నోటీసులు ఇవ్వకుండా వారి వద్ద పనిచేసే వ్యక్తికి అధికారులు నోటీసులు ఇవ్వడం విశేషం . అధికారులు ఇచ్చిన నోటీసుకు బాబురావు నాటి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ ప్రాంతం నుంచి తోటపల్లి, చిన్న ఆగిరిపల్లి, ఆగిరిపల్లి గ్రామాలలోని జగనన్న కాలనీల మేరక తోలకాలకు, రోడ్ల నిర్మాణాలకు మట్టి, గ్రావెల్ తరలి వెళ్లిందని, నాకు అక్రమ తవ్వకాలతో ఎలాంటి సంబంధం లేదని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చాడు. అయితే అధికారులు బాబురావు చెప్పిన వివరాలకు ఎలాంటి ఆధారాలు, అనుమతులు పత్రాలు చూపకపోవడంతో అతనే పెనాల్టీ సొమ్ము చెల్లించాలని స్పష్టం చేస్తూ నోటీసు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ తవ్వకాలు జరిపిన పెద్దలు ఎక్కడి దొంగలు అక్కడ గప్‌చిప్ అన్న చందాన ఉండిపోయారు. ఇప్పుడు తాజాగా మంత్రి పార్థసారథి జిల్లా కమిటీ సమావేశంలో మైనింగ్ రెవెన్యూ అధికారులను రికవరీ ఎందుకు చేయలేదని ప్రశ్నించడంతో ఇప్పుడు కత్తి వాచ్‌మెన్ కంఠంపై వేలాడుతోంది.

ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నూజివీడు వచ్చిన సందర్భంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నూజివీడులో జరిగిన అక్రమ మైనింగ్ వివరాలను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ ప్రభుత్వంలోకి రాగానే నూజివీడు నియోజకవర్గంలో అక్రమ క్వారీయింగ్‌లపై విచారణ జరిపి పెనాల్టీ వసూలు చేస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.

నూజివీడు నియోజకవర్గంలో వైసీపీ పాలనలోనే కాదు ఇటీవల వరకు నూజివీడు, ఆగిరిపల్లి మండలాలల్లో అక్రమ మట్టి గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అవి ఏ స్థాయిలోకి వెళ్లాయంటే అక్రమంగా మట్టి తరలించుకు వెళుతున్న టిప్పర్లను తెలుగుదేశం కార్యకర్తలు ఆపినప్పుడు సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాస గృహానికి వెళ్తున్నాయి.. తప్పుకోండి లేకపోతే తొక్కించేస్తామంటూ బెదిరించిన ఘటనలు జరిగాయి. వాటిని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అక్రమ తవ్వకాలు జరిగినప్పుడు పత్రికల్లో వార్తలు రాగా మంత్రి సారథి అధికారులను హెచ్చరించి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. గత ఐదేళ్ల నుంచి నూజివీడు నియోజకవర్గంలో అనుమతులు ఉండి జరిగిన తవ్వకాలపై, అనుమతులు లేకుండా జరిగిన తవ్వకాలపైన విజిలెన్స్ విచారణ జరిపితే కోట్లాది రూపాయలను పెనాల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందని వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.


ఉండి లక్ష్మీ థియేటర్ సమీపంలో రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షపు నీరు


కొయ్యలగూడెం - కన్నాపురం రహదారిలో భారీ గొయ్యి


టి.నరసాపురం వద్ద ట్రాక్టర్ పైనుంచి గోతిలో పడిన కలప


దెందులూరు మండలం పోతునూరు-ఉండ్రాజవరం రోడ్డుపై దిగబడిన లారీ

ఆంధ్రజ్యోతి పరిశీలన


జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం రోడ్డుపై గండి

దారి.. ధ్వంసం

అడుగడుగునా గోతులతో రహదారులు నరకానికి మార్గాలుగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా రోడ్లు ఎక్కడికక్కడ గోతులు, రాళ్లతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా రహదారులకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో చాలా చోట్ల రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఇటీవల వర్షాలకు మరింత ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారి బాధలు మరింత దయనీయం. ఏజెన్సీలో రహదారులు మరింత భయంకరంగా ఉన్నాయి. ఏటా రహదారులకు గండి పడడం సాధారణమైంది. లోడు వాహనాల పక్కనుంచి వెళితే ఏ వాహనం పడిపోతుందని ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. రహదారుల దుస్థితిపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

- గోతులు, రాళ్లతో రహదారులు అధ్వానం
- ప్రధాన, గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తం
- వర్షపు నీటితో నిండిన గుంతల్లో ప్రమాదాలు
- గాయపడుతున్న వాహనదారులు
- ప్రయాణాలు నిత్య నరకం
- తాత్కాలిక మరమ్మతులతో సరి
- ప్రమాదకరంగా లోడు వాహనాల రాకపోకలు

చింతలపూడిలో ఎక్కడికక్కడ గోతులు

చింతలపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చింతలపూడి రహదారులపై ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. వెలగలపల్లి రోడ్డు, చింతలపూడి పట్టణం తీగలవంచ, దమ్మపేట, అల్లిపల్లి రోడ్డు, జీలకర్రగూడెం వద్ద గోతులు అలాగే ఉన్నాయి. ఇటీవల రేచర్ల వద్ద పెద్దపెద్ద గోతులను పూడ్చినా మళ్లీ గోతులు పడడంతో సిమెంటు రోడ్డు వేశారు. చింతలపూడి నుండి రేచర్ల సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుంది. హైవే అవతల యర్రగుంటపల్లి వరకు రోడ్డు అధ్వానం. చింతలపూడి - తీగలవంచ రోడ్డు అధ్వానంగా ఉంది. చింతలపూడి మెయిన్ రోడ్డు అడుగడుగునా గోతులే. ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో వర్షపునీరు రోడ్లపై నిలిచి ఈ గోతులు ఏర్పడుతున్నాయి.

లింగపాలెంలో అడుగడుగునా గొయ్యి

ఏలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో రహదారుల పై అడుగడుగునా గోతులే. వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీరు రోడ్లపై చేరి చెరువులను తలపిస్తున్నాయి. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెదపాడులో పెద్ద పెద్ద గుంతలు

పెదపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అడుగుకో గొయ్యి... గజానికో గుంతతో పెదపాడు - వట్లూరు రహదారి ఛిద్రం కావడంతో వాహనదారులు హడలిపోతున్నారు. పెదపాడు - వట్లూరు రహదారిలో నిత్యం వివిధ కళాశాలలు, పాఠశాలలకు విద్యార్థులు, వ్యవసాయ పనులపై రైతులు, రైతు కూలీలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ గోతులలో ప్రయాణించేటప్పుడు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే గోతులు నీటితో నిండిపోతున్నాయి.

దెందులూరు రహదారిపై బెంబేలు

దెందులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోతునూరు శివారు ఉండ్రాజవరం రోడ్డు జాతీయ రహదారి నుంచి ప్రమాదభరితంగా మారింది. రహదారిపై ప్రయాణానికి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రహదారిపై కొందరు నడిచి వెళుతున్నారు. ఏ భారీ వాహనం మీద పడుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. కొల్లేరు గ్రామాలతో పాటు పోతునూరు, ఉండ్రాజవరం గ్రామస్తులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

రహదారులు నరకప్రాయం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో రహదారులు పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడితే తిరుమలాపురం రహదారి చెరువులను తలపిస్తుంది. శ్రీనివాసపురం- ములగలంపల్లి రహదారిపై రాళ్ల పైకి లేస్తున్నాయి.


చింతలపూడి మెయిన్ రోడ్డులో భారీ గొయ్యి


పందిరిమామిడిగూడెం-కామవరం రహదారి


పెనుగొండ - మునమర్రు రహదారి


జంగారెడ్డిగూడెం-తిరుమలాపురం రోడ్డుపై చెరువు

రాళ్లు.. గోతులతో ఏలూరు రోడ్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం రోడ్లు గోతులు, రాళ్లతో దారుణంగా ఉన్నాయి. వాహనచోదకులు, ప్రజలు హడలిపోతున్నారు. వంగాయగుడెం నుంచి కొత్తూరు రహదారి అధ్వానంగా మారింది. సుమారు మూడు కిలోమీటర్లు మేర రోడ్లు పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదభరితంగా ఉంది. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ఛిద్రమైపోయాయి. వాహనచోదకులు, ప్రజలు ఈరోడ్డుపై ప్రయాణించేందుకు నరకం చూస్తున్నారు.

భీమడోలు రహదారులు ఛిద్రం

భీమడోలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల పై గోతులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. భీమడోలు, గుండుగొలను, కొల్లేరు గ్రామాల రహదారులు ప్రస్తుత వర్షాలకు ఛిద్రమయ్యాయి. భీమడోలు రైల్వేగేటు నుంచి ద్వారకాతిరుమల మినీ బైపాస్ రోడ్డు గోతుల మయమైంది. వాహనదారులు, ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. కనీసం మకమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఉంగుటూరు మార్గం అధ్వానం

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల వర్షాలకు రహదారులు మరింత పాడవడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఉంగుటూరు-శింగరాజుపాలెం గ్రామాల మధ్య రహదారి గోతులు పడడంతో రాత్రి వేళ్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఉండి-చేబ్రోలు రహదారిలో ఆర్ అండ్ బీ రహదారి కూడా ఈ వర్షాలకు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉండి రహదారికి తూట్లు

ఉండి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉండి-చేబ్రోల్ జాతీయ రహదారికి తూట్లుపడ్డాయి. వర్షాలకు రహదారిపై మరిన్ని భారీ గోతులు పడ్డాయి. ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భీమ వరం నుంచి ఉండి మీదుగా పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు రోడ్, పాందువ్వ రోడ్డు, ఆరేడు మీదుగా గణపవరం ఆర్టీసీ బస్సులు వెళుతుంటా యి. అక్కడి నుంచి తాడేపల్లిగుడెం, చేబ్రోల్, నారాయణపురం మీదుగా ఏలూరు బస్సులు, వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తక్షణమే మరమ్మ తులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పెనుగొండలో బురద మార్గం

పెనుగొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలకు పెనుగొండ మండలంలో రహదారులు బురదమయం అయ్యాయి. గోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. పెనుగొండ నుంచి మునమర్రు, సోమరాజు చెరువు నుంచి కొఠాలపర్రు రహదారులపై గోతుల్లో నీరు నిలిచిపోయింది. వాహనదారులు, ప్రయాణికులు తరచు ప్రమాదాలకు గురవుతున్నారు.


గోతులతో అధ్వానంగా ఉన్న ఏలూరు-వంగాయిగూడెం రోడ్డు

మామిడిగూడెం-కామవరం రోడ్డు మాయం

బుట్టాయగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిరి మామిడిగూడెం-కామవరం మధ్య ఆర్‌అండ్‌బి రోడ్డులో గోతులు ప్రత్యక్షమయ్యాయి. కామవరం, మోతుగూడెం కాలనీ, తానిగూడెం, కోర్సవారి గూడెం గ్రామాల కొండరెడ్లు, గిరిజనులు కేఆర్.పురం ఐటీడీఏ, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి, గుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి ఏకైక మార్గం ఇదే. పందిరిమామిడిగూడెం-కామవరం రోడ్డు గోతులమయం కావడంతో రోడ్డు నిర్మించాలని గిరిజనులు వేడుకున్నారు. కొత్తరోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించి ఉన్న రోడ్డును పూర్తిగా తవ్వి క్వారీ రజను పోసి వదలేశారు. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. వర్షాలకు రజను కొట్టుకుపోయి రహదారి కనిపించనంతగా గోతులు ఏర్పడ్డాయి.


భీమడోలు జంక్షన్‌లో రోడ్డుపై భారీ గోతులు

ఏజెన్సీ రోడ్డు ప్రమాదభరితం

పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి ఇటుకలకోట, గుంజవరం మీదుగా దొండపూడి రోడ్డు భారీ గోతులతో ప్రమాదభరితంగా తయారయ్యింది. గోతుల్లో వర్షం నీరు నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం అధ్వానం కావడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. బండారుగూడెం నుంచి ముత్యాలరావుపేట గ్రామానికి రాకపోకలు సాగించడం కష్టసాధ్యం. ఆ మార్గం ద్వారా తహసీల్దారు, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి జిల్లేల్లగూడెం, పేడ్రాల, కుంకాల, ముత్యాలరావు పేట, రెడ్డినాగంపాలెం, కోయనాగంపాలెం గ్రామాల ప్రజలు 15 కిలోమీటర్ల ఆటోలలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి చేరుకోవాలి. అక్కడి నుంచి 15 కిలో మీటర్లు ప్రయాణించి పోలవరం చేరుకోడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


లింగపాలెం మండలం ములగలంపాడులో రోడ్డుపై గోతులు

జీలుగుమిల్లి రోడ్లకు గండి

జీలుగుమిల్లి, ఆగస్టు 21: (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వంకవారిగూడెం వాగు వద్ద గండి పడింది. పదేళ్లుగా స్థానికులు సొంత ఖర్చులతో వర్షాకాలంలో గండి పూడ్చి రాకపోకలు సాగిస్తున్నారు. వాగు వద్ద వరదనీటి ఉధృతికి మళ్లీ గండి పడింది.

ప్రయాణం దినదిన గండం

టి.నరసాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోడ్లు గోతులతో ప్రయాణం చేయాలంటే దినదినగండంగా మారింది. టి.నరసాపురం నుంచి మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం మీదుగా లక్ష్మీపురం రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారాయి. అప్పలరాజుగూడెం వద్ద పెద్దగొయ్యిలో కలపలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గోతిలో దిగిన ట్రాక్టర్ ఒరిగిపోయింది.


వట్లూరు-పెదపాడు రహదారి గోతులమయం

కన్నాపురం రోడ్డుపై ప్రయాణం నరకం

కొయ్యలగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం-కన్నాపురం రహదారిపై అడుగడుగునా గోతులే. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లడానికి, ఐటీడీఏ కార్యాలయం వెళ్లడానికి కూడా ప్రధాన రహదారి ఇదే. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రెండేళ్లుగా రహదారి పాడై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై పెద్ద పెద్ద గోతులతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో వర్షం నీరు నిండిపోయి వాహనాలు నిలిచిపోతున్నాయి. వాహనచోదకులు ప్రమాదాల బారినపడి గాయపడు తుంటే వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల వర్షాలకు మరిన్ని గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


అధ్వానంగా పోలవరం గుంజవరం ఏజెన్సీ రోడ్డు

యోగాతో మానసిక ప్రశాంతత


యోగా పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణప్రసాద్, పెదకృష్ణంరాజు


రాష్ట్రస్థాయి పోటీల్లో యోగాసనాలతో ఆకట్టుకున్న బాలుడు

వైఎస్ఏపీ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణప్రసాద్

ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ పాఠశాలలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ప్రారంభం

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : యోగాతోనే ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యమని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (వైఎస్ఏపీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శరీరంలో ఉండే అనేక సమస్యలు ఎటువంటి మందులు వాడకుండానే నివారణ అవుతాయన్నారు. ప్రతీఒక్కరూ రోజుకు కొంతసమయాన్ని యోగా లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలన్నారు. అనంతరం యోగా పోటీలను ప్రారంభించారు. రాష్ట్రం నుంచి మొత్తం సుమారు 500 మంది అభ్యర్థులు యోగా పోటీలలో పాల్గొనేందుకు వస్తున్నట్లు పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో కొలనువాడ పెదకృష్ణంరాజు, రవీంద్రనాథ్, ఏసుబాబు, కే.రామకృష్ణ, మాధవరావు, దుర్గారావు, డాక్టర్ పల్లవి, గట్టిం మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సుందర గిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువు దీరిన శ్రీలక్ష్మీనారసింహుని ఆలయంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన దివ్యపవిత్రోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. స్మార్త ఆగమాన్ని అనుసరించి ఈనెల 19 నుండి మూడురోజులు పాటు తొలిసారి దివ్యపవిత్రోత్సవాలు నిర్వహించేం దుకు దేవస్థానం శ్రీకారం చుట్టిన విషయం విదితమే.. ఏడాదిలో ఆలయంలో తెలిసి తెలియక దొర్లిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ ఉత్సవాలను జరుపుతారు. ఈక్రమంలో గురువారం ఆలయ యాగశాలలో మహాశాంతి హోమం, పౌష్టిక హోమం, శ్రీమహాపూర్ణాహుతి హోమం, పవిత్రవిసర్జన, శాంతికల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. ఆలయ ఈవో ఎన్‌వీ.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. లక్ష్మీపురం ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న దివ్య పవిత్రోత్సవాలు గురువారం జరిగిన శ్రీమహాపూర్ణాహుతి హోమంతో ముగిశాయి.


ఆలయంలో శాంతికల్యాణంలో కనకవల్లీ సమేత లక్ష్మీనారసింహుడు

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

చిన వెంకన్న క్షేత్రంలోని అనివేటి మండపం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను పెద్ద ఎత్తున జరిపేందుకు దేవస్థానం చేసిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రత నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే వేదికను నిర్మించారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా అరటి బోదెలు, మామిడి తోరణాలతో సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. అధికసంఖ్యలో ముత్తైదువులు హాజరుకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వారికి దేవస్థానం కొంత మేర పూజా సామగ్రి అందజేస్తుందని అధికారులు చెబుతున్నారు. వందల సంఖ్యలో మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.



ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలు
దరఖాస్తు గడువు 24

ఏలూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు ప్రతిపాదనలను స్వీకరిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ గురువారం తెలిపారు. అర్హతలు, ఆసక్తివున్న టీచర్లు లీప్ యాప్‌లో అంతర్ జిల్లా బదిలీలకు ఈ నెల 24లోగా దరఖాస్తుచేసుకుని, ప్రింటవుట్ సంబంధిత ఎంఈవోకు సమర్పించాలన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జీవిత భాగస్వామి ఆధారంగా స్పౌజ్ కేటగిరీ, పరస్పర అభ్యర్థనల ప్రకారం మ్యూచువల్ అంతర జిల్లా బదిలీలకు దరఖాస్తులను ప్రాసెస్ చేస్తామని వివరించారు. బదిలీలకు అర్హతలు, ఇతర వివరాలు, ప్రొఫార్మాల కోసం www.deoeluru.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.


కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన త్రిమూర్తులు

కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా
బాధ్యతలు చేపట్టిన త్రిమూర్తులు

భీమవరం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఏపీ కృష్ణ బలిజ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గంటా త్రిమూర్తులు విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమ కార్యాలయంలో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తనకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కేంద్ర మంత్రి వర్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మంతెన రామరాజు, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కార్పొరేషన్ అధికారి జేఎండి ఉమాదేవి నుంచి త్రిమూర్తులు అధికార పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడు ముద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, యలమంచిలి శ్రీను, మర పట్ల శ్యాంబాబు, కాపా అమర్‌బాబు, వినాయక్, తోట వెంకటేశ్వరరావు, గొల గాని దుర్గారావు, అన్నం నాంచారయ్య, జె.రాజు, జె.దుర్గ, నేదునూరి గంగాధర్ తిలక్, మద్దుల సాయి, తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలకు సహకరిస్తా
ఆస్ట్రోనాట్ జాహ్నవికి కేంద్ర మంత్రి వర్మ హామీ


జాహ్నవిని సత్కరించిన మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్/పాలకొల్లు టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):అమెరికాలోని ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్(టీఎస్ఐ)' 2029లో నిర్వహించే అంతరిక్ష యాత్రకు ఎంపికైన పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి(23) గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా వర్మను కలిసిన జాహ్నవి, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. జాహ్నవి దేశానికి మరింత పేరు తీసుకొచ్చేందుకు అన్ని విధాలా ఆమె శిక్షణ, భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు సహకరిస్తానని వర్మ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి అభినందించారు.

వెంకటరమణ ట్రస్టు సేవలు అభినందనీయం
» కలెక్టర్ నాగరాణి


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెంటపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్న శ్రీవెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. అలంపురం ట్రస్టు ఆసుపత్రిని గురువారం సందర్శించారు. రోగులతో మాట్లాడి ట్రస్టు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్ పెదకృష్ణంరాజు సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో వేలాది మందికి వైద్య సేవలందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రజలకు తన వంతు సేవలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు, ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌బనో, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ.సత్యనారాయణ, సర్పంచ్ తాతపూడి ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏఆర్‌డీజీకే విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

ఏలూరు రూరల్, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారపు పేట ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 17న విజయనగరం జిల్లా కొండవెలగాడలో జరిగిన అస్మిత్ ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం.పావని 44 కేజీల విభాగంలో బంగారు పతకం, ఎం.దీక్షిత 44 కేజీల విభాగంలో రజత పతకం, సీహెచ్ కీర్తన 58 కేజీల విభాగంలో రజత పతకం, కె భార్గవి 58 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈనెల 23న విశాఖపట్నంలో జరిగే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వి.క్రాంతి జయకుమార్ తెలిపారు.

గురుకులం విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో గురుకులం అధ్యాపకులు

దెందులూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న కవాతుతో పాటు పలు విన్యాసాల్లో వరసగా మూడోసారి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన గురుకులం విద్యార్థులను ఉపాధ్యాయలు ఘనంగా సన్మానించారు. గురువారం పెదవేగి మండలం లక్ష్మీపురంలోని ఏపీ ప్రభుత్వ అంబేడ్కర్ గురుకులంలో వరుసగా మూడవసారి రాష్ట్రస్థాయిలో గురుకులం విద్యార్థులకు మొదటి స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని గురుకులం ప్రిన్సిపాల్ ఏవీశివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయుడు వై.శ్రీనివాస్, పీడీ జయరాజు, సురేష్‌లు పేర్కొన్నారు.

స్వర్ణమయ పథకానికి రూ.5 లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న దాత పెద్దిరాజు

ద్వారకాతిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి దాత గురువారం రూ.5లక్షల విరాళం అందజేశారు. భీమవరానికి చెందిన కొప్పిరెడ్డి పెద్దిరాజు ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఏఈవో పి.నటరాజారావుకు చెక్కును అందజేశారు.

మీ సేవ కేంద్రాలకు మంగళం!



జగన్ సచివాలయ వ్యవస్థతో కుదేలు » ఆదుకోవాలని మంత్రి లోకేశ్‌కు నిర్వాహకుల వినతి

వైసీపీ అధికారంలోకి వచ్చేంత వరకు ఓ వెలుగు వెలిగి ప్రజలకు సుదీర్ఘ కాలం సేవలందించిన మీ సేవ కేంద్రాల మాట ఇక మర్చిపోవాల్సిందే. జగన్ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో వీటికి చెక్ పడింది. ఫలితంగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. సుమారు పది వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.

ఏలూరు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందించిన మీసేవ కేంద్రాలకు మంగళం పలకడంతో వాటి నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేరకపోవడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో మీసేవల నడ్డివిరిచాయి. ప్రస్తుతం అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్రలో లోకేశ్ ప్రకటించారు. మీసేవ కేంద్రాలు పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది కుటుంబాలు జీవనం సాగించేవి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీసేవలకు మహర్దశ వస్తుందని ఆశించిన నిర్వాహకులకు నిరాశనే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది వేల మీసేవ నిర్వాహకుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది. ఏలూరు జిల్లాలో 442 మీసేవ కేంద్రాలు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తేవడంతో మీసేవ కేంద్రాలు ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. వైసీపీ పాలనలో మీ సేవ అందించే సర్వీసులన్నీ సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామని చెప్పి తరువాత రుసుం వసూలు ప్రారంభించారు. మీ సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ అప్పట్లో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో ప్రచారం జరిగింది. ఈ మేరకు ప్రజలు సచివాలయాలనే ఆశ్రయించారు. మీసేవ కేంద్రాల ద్వారా రెవెన్యూ ఏపీఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర శాఖలకు చెందిన దాదాపు 364 సేవలు ప్రజలకు అందించేవారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుంలో కొంత భాగం కమీషన్ రూపంలో మీసేవ నిర్వాహకులు తీసుకునేవారు.

తగ్గిపోయిన సేవలు

గతంలో 364 సేవలందించి అనేక మందికి ఆసరాగా నిలిచిన మీ సేవ కేంద్రాలు తాజాగా సేవలు లేక కుచించుకు పోతున్నాయి. ఇటు ప్రభుత్వ రంగంలోని చలానాలు, పాస్‌పోర్ట్ దరఖాస్తు నుంచి డ్రైవింగ్ లైసెన్స్ వరకు అన్ని సేవలు అందించేవి.

ప్రస్తుతం ప్రభుత్వ సీఎస్‌సీ సెంటర్‌లకే ఈ సేవలన్నింటిని పరిమితం చేసి మీ సేవ కేంద్రాల ద్వారా కరెంటు బిల్లులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ స్టేషన్‌ల కంప్లెయింట్స్ తప్ప మరే సేవలు ఉండడం లేదని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 400 సెంటర్‌లు ఉండేవి. ప్రస్తుతం 250 సెంటర్‌లకు పడిపోయాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి



మంత్రి నారా లోకేశ్ హామీని అమలుపరచాలి. అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు స్వయంగా భరిస్తూ కేంద్రాలు నడుపుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వం చొరవ చూపి మీసేవా కేంద్రాల భవితవ్యంపై సుముచిత నిర్ణయం తీసుకుని పూర్వ వైభవం తీసుకువచ్చేలా న్యాయం చేయాలి.

- టి.స్వరూపరాణి, రాష్ట్ర అధ్యక్షురాలు. రాష్ట్ర గ్రామీణ మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం

అసంతృప్తి సేవలు

సచివాలయాల ద్వారా మీసేవ సేవలను అందించాలని గత వైసీపీ ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాల ద్వారా ప్రజలు అసంతృప్తిలో ఉంటున్నారు. మీ సేవల ద్వారా అందించే సేవలను కుదించడం వల్ల ఇటు సచివాలయాల వద్ద పనులు కాక, మరోపక్క మీసేవల ద్వారా పనులు ముందుకు కదలక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత విధానాలు అమలు చేయడంతోపాటు సచివాలయాలు, మీసేవా సెంటర్లు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందించాల్సిన అవసరం ఉంది.

కొండలరావుపాలెంలో
ఉద్రిక్తత

» వైసీపీ శ్రేణులు.. కొల్లేరు గ్రామస్థుల మధ్య ఘర్షణ
» నిరసనకారుల పైకి దూసుకొచ్చిన మాజీ ఎమ్మెల్యే కొఠారు
» ఇరు వర్గాలను చెదరగొట్టి పంపించిన పోలీసులు


కొల్లేరు గ్రామస్థులపైకి దూసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు, వైసీపీ కార్యకర్తలు


కొండలరావుపాలెంలో నీటి సంఘం అధ్యక్షుడిపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు

దెందులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చేపల చెరువు లీజు సొమ్ము చెల్లించాలని కొంతకాలంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై దాడులు చేయించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారనే అనుమానంతో కొల్లేరువాసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించి వేశారు. కొల్లేరు గ్రామాలైన ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక వాసులు తమ చేపల చెరువు లీజు డబ్బులు చెల్లించాలని కొద్దిరోజులుగా కొఠారు నివాసం వద్ద వంటా వార్పుతో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం లండన్ నుంచి వచ్చారు. తన పామాయిల్, కోకో తోటల్లో అబ్బయ్య చౌదరి కూలీలతో పంట కోత పనులను చేపట్టారు. ఈ విషయం తెలియడంతో గురువారం ఆయన నివాసం ముట్టడికి కొల్లేరువాసులు సన్నద్ధమయ్యారు. బుధవారం రాత్రి నుంచే కొఠారు ఇంటిచుట్టూ నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ రాజశేఖర్, ఎస్ఐలు కె.రామకృష్ణ, శివాజీ ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టారు. కొల్లేరు గ్రామస్థులు పోలీసుల కన్ను గప్పి గురువారం ఉదయం కొఠారు ఇంటికి చేరుకుని నిరసనకు దిగారు. వారికి టీడీపీ వర్గీయులు మద్దతుగా నిలిచారు. వీరిని వైసీపీ వర్గీయులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. 'నా పొలంలో పామాయిల్, కోకో కాయలను కోసుకుంటుంటే ఎవరు వచ్చి పనులు ఆపుతారో చూస్తా' అంటూ కొఠారు దురుసుగా కొల్లేరు వాసులపైకి దూసుకు రావడంతో వివాదం ముదిరింది. దీంతో ఇరు వర్గాలను అక్కడ నుంచి డీఎస్పీ ఆధ్వర్యంలో పంపించి వేశారు. కొల్లేరు సంఘం నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా తమకు రావాల్సిన బాకీ డబ్బులను అడుగుతుంటే అబ్బయ్యచౌదరి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో దగ్గరుండి దాడులు చేయించడం అన్యాయమన్నారు. మరోవైపు కొఠారు స్పందిస్తూ తాను ఎవరికి లీజు సొమ్ము లు ఇవ్వాల్సిన అవసరం లేదని, దివ్యాంగుల పింఛన్‌లను ఎందుకు తొలగించారని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పకుండా కక్ష సాధింపునకు దిగారన్నారు.

నీటి సంఘం అధ్యక్షుడికి గాయాలు

టీడీపీ నాయకుడు, పోతునూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబుపై కొంత మంది వైసీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. ఆయనను టీడీపీ గ్రామ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్‌తోపాటు పలువురు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గాయపడిన రాంబాబును ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు.


కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు పాకా

రైల్వేశాఖ మంత్రిని కలిసిన పాకా

భీమవరంటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వందే భారత్ రైలును భీమవరం వరకు పొడిగించే విషయంపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. దీనిపై రైల్వే మంత్రి సానుకూల స్పందన తెలిపారు. తమ ప్రాంతంలో రైల్వే అభివృద్ధిని వేగవంతం చేసేందుకు పలు అంశాలపై చర్చలు జరిగాయని పాకా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో రైల్వేరంగం ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందుతోందన్నారు.

దగ్గు మందు వికటించి బాలుడికి అస్వస్థత
మందుల చీటీ లేకుండా మందుల విక్రయం
షాపు వద్ద బంధువుల ఆందోళన

నరసాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఓ కార్పొరేట్‌కు సంస్థకు చెందిన మెడికల్ దుకాణంలోని సేల్స్‌మన్ నిర్వాకం వల్ల ఆరేళ్ల బాలుడు ప్రాణాపాయ స్థితికి చేరాడు. వైద్యుల మందుల చీటీ లేకుండా దగ్గు మందు విక్రయించడమే కాకుండా పెద్దలు వాడాల్సిన మందును చిన్న పిల్లలకు ఇచ్చాడు. పెద్దగా చదువుకోని ఆ తల్లిదండ్రులు బాలుడికి వేయడంతో వికటించి సీరియస్ అయ్యింది. కాళ్లు చేతులు కొట్టుకుని ఫిట్స్‌గా రావడంతో వెంటనే చిన్న పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. వాడిన మందును చూపించగా.. పెద్దలు వాడే ఈ మందు చిన్న పిల్లడికి ఎలా వేశారంటూ మందలించాడు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం కుదుటపడింది. తర్వాత మెడికల్ షాపు వద్ద బాలుడి బంధువులు ఆందోళనకు దిగారు. చిన్న పిల్లాడికి అని చెప్పినా.. పెద్దలకు వేసే మందు ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. బంధువుల ఆందోళనతో గురువారం రాత్రి దుకాణాన్ని మూసివేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేయడంతో గురువారం వచ్చి దుకాణాన్ని తనిఖీలు నిర్వహించారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైద్యుల చీటీ లేకుండా మందు విక్రయించిన మాట వాస్తవమని విచారణలో తేలిందన్నారు. కార్పొరేట్ మందుల దుకాణదారుడికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నామన్నారు.

పేరుపాలెంలో బైక్ ఢీకొని యువకుడి మృతి

మొగల్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పేరుపాలెం బీచ్ రోడ్డులో బైక్ ఢీకొని ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మొగల్తూరు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాలివి.. పేరుపాలేనికి చెందిన కొక్కిరగడ్డ లక్ష్మీనర్సింహస్వామి బుధవారం బీచ్ రోడ్డులోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి మరో వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నర్సింహస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోదెలో పడి ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఎం.డి.కామరుద్దీన్(52) నారాయణపురంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తన స్వస్థలం ఏలూరు వెళుండగా గురువారం ఉదయం కైకరం శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పంట బోదెలో పడిపోయి వుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు చేబ్రోలు ఎస్.ఐ. మామిడాల సూర్యభగవాన్ తెలిపారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అపార్టమెంట్ సెల్లార్‌లో మృతదేహం
గుర్తించలేని స్థితిలో కుళ్లిన మృతదేహం

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న ఒక అపార్టుమెంట్ సెల్లార్‌లో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో తుమ్మపూడి నాగవెంకట జగన్మోహనరావుకు చెందిన మూడంతస్తుల నూతన భవన నిర్మాణం జరుగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో గురువారం మధ్యాహ్నం చుట్టు పక్కలవారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వన్‌టౌన్ ఎస్ఐ మదీనా బాషా వారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు సుమారు 35-40 సంవత్సరాల వయస్సు కలిగి గుర్తించలేని పరిస్థితిలో మృతదేహం ఉంది. కొద్ది రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వశిష్ఠ గోదావరిపై హైలెవెల్ వారధి!

ఢిల్లీలో ఉన్నతాధికారులకు కేంద్ర సహాయ మంత్రి వర్మ విజ్ఞప్తి
కమిటీ నియమిస్తామంటూ హామీ

భీమవరం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో కీలక జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వశిష్ఠ గోదావరిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణంపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌ను గురువారం కలిసి చర్చించారు. ఆచంట నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వశిష్ఠ గోదావరి నది పైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ఎన్‌హెచ్-216, ఆకివీడు - దిగమర్రు రహదారి పనులు త్వరితగతిన ప్రారంభించాలని, అలాగే నిలిచిపోయిన ఎన్‌హెచ్ 165 నరసాపురం బైపాస్ పనులు వేగవంతం చేయాలని శ్రీనివాస వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కూడా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి శ్రీనివాస వర్మ,ఎమ్మెల్యే సత్యనారాయణలు కార్యదర్శి ఉమా శంకర్‌ను శాలువాతో సత్కరించారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విజ్ఞప్తిపై కార్యదర్శి ఉమాశంకర్ సానుకూలంగా స్పందించారు. ఎన్‌హెచ్- 216, 165 పనులు ఈ ఏడాదిలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా కోడేరు నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎల్.గన్నవరం మధ్య వశిష్ఠ గోదావరిపై రూ. 504 కోట్లతో హైలెవెల్ వశిష్ఠ వారధి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించేందుకు త్వరలోనే ఒక ఉన్నతస్థాయి బృందాన్ని పంపిస్తామని, రాష్ట్ర ప్రభుత్వంతో బ్రిడ్జి నిర్మాణం కోసం సంప్రదించి పూర్తి సహకారం అందిస్తామని కార్యదర్శి ఉమా శంకర్ హామీ ఇచ్చారు.


ఉమాశంకర్‌ను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, మాజీ మంత్రి పితాని

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన కాలేజీ బస్సు
గాయపడిన వారిని ఆస్పత్రికి తరలింపు - మరికొందరికి స్వల్ప గాయాలు


ధ్వంసమైన బస్సు ముందుభాగం

కాళ్ల ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):తమ పిల్లలు కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధిస్తారనే ఆశతో తల్లిదండ్రులు స్థాయికి మించి తమ పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చదివిస్తున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం బస్సులు, తక్కువ జీతాలకు దొరుకుతున్న అనుభవం లేని డ్రైవర్ల వల్ల రోజూ ఎక్కడో ఒకచోట పాఠశాల, కళాశాలల బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతూనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు భయంతో జీవిస్తున్నారు.మండల కేంద్రమైన కాళ్లలో గురువారం ఉదయం ఇలాంటి సంఘటనే జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాల బస్సు విద్యార్థుల కోసం రోడ్డు పక్కన ఆగి ఉండగా, పెన్నాడలోని వైట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా భయంతో హాహాకారాలు పెట్టారు. బస్సును వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఆ బస్సుతో పాటు ఢీకొన్న బస్సుకి అద్దాలు ధ్వంసమయ్యాయి. రెండు బస్సుల్లోనూ సుమారు 60 మంది బాలికలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో కొంత మంది విద్యార్థినులకు ముఖం, చేతులపై పెద్ద గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను కళాశాల యాజమాన్యాలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని,ఇలాంటి యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతి

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల వలన ఎదుటి వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా జరుపుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ప్రజలకు సూచించారు. ఉత్సవ కమిటీలు పోలీసుల అనుమతి కోసం రుసుం లేని సింగిల్ విండో విధానం ద్వారా https://ganeshutsav.net లింకు ఓపెన్ చేసి ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా లాగిన్ అయి అప్లికేషన్‌లో ఉన్న కాలమ్స్‌ను పూర్తి చేసి సబ్‌మిట్ చేయాలన్నారు. ఆ తరువాత పోలీస్ వెరిఫికేషన్ అయిన వెంటనే క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకుని మండపాల వద్ద అతికించాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే వారు పోలీస్ నిబంధనలను పాటించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో పోలీస్ శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరు నెలలు జైలు, రూ.వెయ్యి జరిమానా ఉంటుందన్నారు. ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా సంబంధిత పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు రోడ్డుకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. శబ్ద కాలుష్యం వచ్చే స్పీకర్లు నిర్వహించకూడదని, ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే మైక్‌లను ఉపయోగించుకోవాలన్నారు. వినాయక చవితి నిమజ్జనంలో అశ్లీల నృత్యాలు కాని, డిజె సౌండ్స్ కాని నిర్వహించకూడదని అన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే వారు సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి తీసుకెళ్లే మార్గాన్ని, సమయాన్ని ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు.

నైపుణ్య శిక్షణ తరగతులు
న్యాక్ ఏడీ ఎం.వసంతరావు

ఏలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో షింగ్‌స్టేటర్(ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఎస్ఐపీఎల్)తో అవగాహన ఒప్పందం నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో నైపుణ్య శిక్షణ తరగతులను నరసాపురం పి.ఎం. లంక డిజిటల్ కమ్యూనిటీ భవన్‌లో త్వరలో ప్రారంభమవుతాయని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) సహాయ సంచాలకులు ఎం.వసంతరావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన షింగ్‌స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్(ఎస్ఎస్ఐపీఎల్)తో అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. దీని ప్రకారం ఎన్ఎస్‌డీసీ ఆమోదిత ఉద్యోగ పాత్రల ఆధారంగా శిక్షణ కార్యక్రమాలు, తరగతి గదుల్లో సిద్ధాంత బోధనతోపాటు ప్రాజెక్టు సైట్లలో ప్రాక్టికల్ శిక్షణ, అత్యాధునిక పరికరాలు, భద్రతా కిట్లు, రవాణా సౌకర్యం అందిస్తామ న్నారు.

ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు
సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ఇటీవల కానిస్టేబుళ్ల పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. తాత్కాలికంగా ఎంపికైన సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులు (పురుషులు/మహిళలు), ఏఆర్, ఏపీఎస్పీ పురుష, మహిళా అభ్యర్థులు వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. పాత పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్లతో ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయానికి ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ధృవీకరణ పత్రాలు పరిశీలన జరుగుతుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ప్రతి సర్టిఫికెట్‌కు మూడు జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారిచే ఎటెస్టేషన్ చేయించి తీసుకురావాలన్నారు.పాస్‌పోర్టు సైజు ఫోటోలు మూడు తీసుకురావాలన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపండి : ఏఐటీయూసీ

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మంది ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయారన్నారు. ఏఐటీయూసీ నాయకులు పళ్ళెం కిషోర్, ఆటో కార్మికులు ఉన్నారు.

తొమ్మిది గ్రామాల్లో కొనసాగుతున్న స్వమిత్వ సర్వే

కామవరపుకోట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మండలంలోని కొన్ని గ్రామాల్లో స్వమిత్వ సర్వేను గురువారం ప్రారంభించింది. ఈ మేరకు పోలాసిగూడెం, కళ్ళచెరువు, అంకాలంపాడు, గుంటుపల్లి, ఉప్పలపాడు, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు, మంకినపల్లి గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి ప్రతీ కుటుంబ సభ్యుల వివరాలు, ఆస్తి వివరాలు, ఇంటి విస్తీర్ణం వివరాలు సేకరిస్తున్నారు. సర్వే అనంతరం ప్రభుత్వం ప్రత్యేక కార్డును అందజేస్తుందన్నారు.

సెయింట్ థెరిస్సాలో మెగా హెల్త్ క్యాంపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉద్యోగులకు కంప్యూటర్ల వినియోగం ఎక్కువకావడంతో కంటిచూపు సమస్యలపై అవగాహన కల్పించేలా నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు స్థానిక ఆశ్రం ఆసుపత్రి వైద్య నిపుణులు తెలిపారు. గురువారం సెయింట్ థెరిస్సా మహిళాకళాశాలలో నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంపులో విద్యార్థినులకు కంటిపరీక్షలు, మంచి ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, పీజీ కోర్సుల డైరెక్టర్ సిస్టర్ సుశీల, అధ్యాపకులు ఇందిర, మాధవీరాణి, ప్రతిమాకుమారి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి : సీఐ


మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్

చింతలపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పందిళ్లు వేసే కమి టీలు అనుమతులు తప్పనిసరిగా పొందాలని పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులకు చవితి పందిళ్లపై అవగాహన కల్పించారు. చవితి పందిళ్లు వేసే నిర్వాహకుల పేర్లు, ఆధార్ కార్డు తీ సుకోవాలన్నారు. పబ్లిక్ రోడ్లు, ప్రజలు తిరిగే మార్గాలలో ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా పందిళ్ళు వేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ నుంచి అనుమతులు పొందాలని, విగ్రహాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, నిమజ్జనం తర లింపు రోజు అసభ్యకర నృత్యాలు చేయరాదని, నిమజ్జనం చేసే ప్రదేశాలు పంచా యతీ, రెవెన్యూలలో తెలియజేయాలని, సాయంత్రం 6 గంటల్లోపే నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. మహిళా పోలీసులు ఆయా ప్రాంతాల్లో చవితి పందిళ్లను పరిశీలించాలని సూచించారు. ఎస్ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

వైకల్యం నివారణపై అవగాహన సదస్సు

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సహకారంతో స్థానిక కంద్రికగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం ఎస్.ఉమా, ఎస్.కనకరాజు అతిథిగా పాల్గొన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ వైకల్య నివారణకు తీసుకోవల్సిన ముందు జాగ్రత్తల గురించి, వైకల్యం వచ్చిన తరువాత దానిని ఎలా ఎదుర్కొనాలనే అంశాలపై వివరించారు. అనంతరం సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్ర సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఉనికిలి గ్రామస్థులు

లీజు సొమ్ము సమానంగా పంచాలంటూ ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గత 40 ఏళ్ల నుంచి కొనసాగుతున్న వేదంగాని భూముల లీజు వాటాలు అన్ని కుటుంబాలకు సమానంగా పంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఉనికిలి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన దళితులు గురువారం దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబురావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వేదంగాని భూములకు నకిలీ పట్టాలు సృష్టించి కాజేయాలని ప్రయత్నించారని, కానీ ప్రభుత్వ అధికారులు విచారణ చేసి ఆ నకిలీ పట్టాలు రద్దు చేశారన్నారు. పట్టాదారులను కొంతమంది రెచ్చగొడుతున్నారని, లీజు సొమ్ము అన్ని కుటుంబాలకు పంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్‌వోను కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామస్థులు కె.రాజబాబు, గుడిపూడి యోహాను, వి.యేసేపు, కె.సురేశ్ పాల్గొన్నారు.

పాఠశాల స్వీపర్ పుష్పకు నగదు అందజేత

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెదవెల్లమిల్లిలో ఆగస్టు 15న జెండా దిమ్మెను తొలగిస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో ఆ పాఠశాల స్వీపర్ ఉసురుమర్తి పుష్ప భర్త భీమరాజు మృతి చెందిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్సీ గోపి మూర్తి, విద్యాశాఖ అధికారిణి నిమ్మగడ్డ రవీంద్ర భారతి చేతుల మీదుగా యూటీఎఫ్ నాయకులు సేకరించిన రూ.2,50,000, టీడీపీ నాయకులు సేకరించిన రూ.1,50,000 కలిపి మొత్తం రూ.4 లక్షలను పుష్పకు అందించారు. మండల యూ.టి.ఎఫ్ నాయకులు ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చలంచర్ల రాణి, ఉపాధ్యాయులు దివ్య జ్యోతి, యూ.టి.ఎఫ్ నాయకులు ముస్తఫా ఆలీ, కార్యదర్శులు శ్రీధర్, శీతాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ వల్లి పద్మ విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆదేశాల మేరకు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు ఆధ్వర్యంలో సీఆర్ఆర్ కాలేజీలో విద్యార్థు లకు గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వల్లి పద్మ మాట్లాడుతూ సోషల్ మీడియా అకౌంట్ల విషయంలో జాగ్రత్తగా ఉం డాలన్నారు. ఎవరైనా సైబర్ వేధింపులకు గురైతే వెంటనే 1930కు సమాచారం ఇ వ్వాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వచ్చే ప్రక టనలు చూసి మోసపోవద్దన్నారు. త్రి టౌన్ ఎస్ఐ అప్పారావు, సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఇటీవల జరిగిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆరవ మహాసభలో నూతన కమిటీని ఎంపిక చేసినట్టు యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, కోశాధికారి రెడ్డి లక్ష్మణరావులు తెలిపారు. ఈ మేరకు ఏలూరు జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా యర్రా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా నారపల్లి రమణారావు, కోశాధికారిగా రెడ్డి లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షుడుగా తాడి సత్యనారాయణ, షేక్ బాషా, కెల్లా దుర్గాప్రసాద్, ఎం.ఇస్సాకు, జిల్లా సహాయ కార్యదర్శులుగా సి.హెచ్. కొండలరావు, ఆదికృష్ణ, అప్పారావు ఎన్నికయ్యారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, భవన నిర్మాణ మెటీరియల్ ధరలు తగ్గించాలని తీర్మానించినట్టు తెలిపారు.

జల దిగ్బంధం

(5వ పేజీ తరువాయి)

మునిగాయి. ఏటిగట్టుకు కుడి వైపున కడెమ్మ కాలువ జలాలు, కొండ వాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంట పొలాలు నీటమునిగాయి.

నిలకడగా కొల్లేరు

కైకలూరు : కొల్లేరు ఉధృతి గురువారం కొద్ది మేరకు తగ్గి నిలకడగా ప్రవహించడంతో రహదారులు కొద్దికొద్దీగా కోలుకుంటున్నాయి. మండవల్లి మండలం పెనుమాకలంక రహదారిపై నాలుగు అడుగుల మేర ప్రవహించిన నీరు రెండు అడుగులకు తగ్గింది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతి తగ్గింది.

కొత్త ముహూర్తం!

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్ల విషయంలో వీలైతే వచ్చే జనవరిలో సంక్రాంతికి ముందుగా గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం పరిధిలో టిడ్కో ఇళ్లు నిర్మాణం అసంపూర్తిగానే నిలిచాయి. ఏలూరులో 2,200 ఇళ్లకుపైగా నివాసానికి అనువుగా ఐదేళ్ల క్రితమే సిద్ధమయ్యాయి. ఇవన్నీ సాంకేతిక ఆటంకాలు.. అధిగమించిన తర్వాత గృహ ప్రవేశాలకు అనువుగా కీలక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

చిగురిస్తున్న ఖరీఫ్ ఆశలు..

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. నిన్నటి వరకు మందకొడిగా సాగిన ఖరీఫ్ ఇప్పుడు నెమ్మదిగా పుంజుకుంటోంది. గత వారం నుంచి మండలంలో ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సాగులో కదలిక వచ్చింది. ఈ నెల మొదటి వారం వరకు దాదాపు రెండు నెలలు పైబడి వర్షాభావం వెంటాడటంతో ఖరీఫ్ మందకొడిగా సాగింది. దీంతో ఏలూరు రూరల్ మండలంలో గత వారం నుంచి ఆశాజనకంగా వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ సాగు గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తెరిపినివ్వగానే ఖరీఫ్ సాగు మరింత జోరందుకోనుంది. దీంతో సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. వరినాట్లు జోరందుకున్నాయి. అలాగే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగంలో ఆశలు చిగురించేలా చేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతాంగానికి ఎదురుచూపులు తప్పలేదు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రాణం పోసినట్టయింది.


నాట్లు వేస్తున్న మహిళలు

గుండుగొలను వంతెన సమస్యకు మోక్షం


నిర్మాణం పూర్తయిన వంతెన

భీమడోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గుండుగొలను, కొల్లేటి వాసుల దీర్ఘకాలిక సమస్య అయిన గుండుగొలను వంతెనకు మోక్షం లభించింది. వంతెన ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించినా అనుమతులు లేకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. దీంతో ఇదే ప్రాంతంలో గ్రామస్థుల రాకపోకలకు తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటు చేసుకున్నారు. వంతెన సమస్యను స్థానిక గ్రామస్థులతో పాటు కూటమి నేతలు సమస్యను ఎంపీ పుట్టా మహేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలిసి నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత ఉన్నతాధికారులను కలిసి అనుమతులు తీసుకొచ్చేందుకు ఎంపీ శ్రమించడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యాయి. త్వరలో గుండుగొలను వంతెన ప్రారంభం కానుంది. నిర్మాణం పూర్తి చేసేందుకు ఎంపీ చేసిన కృషిని ప్రశంసిస్తూ, స్థానిక ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అంగన్‌వాడీల నిరసన


భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చింతలపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు బ్లాక్ డే నిర్వహించారు.గురువారం సాయంత్రం అంగన్‌వాడీలు కొద్దిసేపు నల్ల చీరలు ధరించి నినాదాలు చేశారు. యాప్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటీ జీవో మార్పు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ యూనియన్‌లు ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో చింతలపూడి యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడి తమ డిమాండ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాళ్లు సరోజిని, సరళా దేవి, అరుణ, ఫణివర్ధిని, కవిత, హేమలత, అంజమ్మ, సీఐటీయూ నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ పాల్గొని మద్దతు తెలిపారు.

● భీమడోలు: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు తెచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భీమడోలులోని అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, సీఐటీయూ నాయకులు లింగరాజు, చల్లామణి, మల్లేశ్వరి రేవతి, అపర్ణ, రాధ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మాణిక్యమ్మ డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్‌డే నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి అలుమోలు మురళీ, ఝాన్సీ పాల్గొన్నారు.

● ఏలూరుకార్పొరేషన్: సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేసి మానవహారాన్ని నిర్వహించారు. పలువురు అంగన్‌వాడీలు నల్ల చీరలు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు పంపన రవి కుమార్, ఎం.ఇస్సాక్, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సమీమ, రజినీ, ఐద్వా జిల్లా అధ్యక్షులు హైమావతి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, రైతు సంఘ నాయకులు కోటేశ్వరరావులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం


సమీక్షలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

ఏలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు,సిబ్బంది ప్రజలకు అందించే సేవల విషయంలో నిర్లక్ష్యం వహించినా, సమయ పాలన పాటించకున్నా ఉపేక్షించేది లేదని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. లింగపాలెం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులను ఆయా శాఖల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలు, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చెయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించేందుకు వెళ్లగా రికార్డు రూమ్ తాళాలు అందుబాటులో లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఆర్‌పీఎస్ స్థూపం ఆవిష్కరణ

కామవరపుకోట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):తూర్పు యడవల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన స్థూపాన్ని బుధవారం రాత్రి నాయకులు ప్రారంభించారు. ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌చార్జి భారతాల రమేష్ మాదిగ,నాయకులు ప్రొద్దుటూరు వీరాంజనేయులు, కొలుపుకోమి రామకృష్ణ, దొండపాటి రాజేష్, లక్ష్మీనారాయణ, చౌటపల్లి వెంకటేష్, కొత్తపల్లి మురళీ, తనగల శేఖర్, యర్రా రాజేష్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గోపీ మూర్తి పర్యటన

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపీ మూర్తి సుడిగాలి పర్యటన చేశారు. హైస్కూళ్లు, కళాశాలల అధ్యాపకుల సమస్యలడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉంగుటూరు భవిత పాఠశాలలో టీచర్ రాజును అభినందించారు.

ఆస్పత్రిలో అత్యవసర వైద్యం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఛాతీలో నొప్పితో ప్రాణాపాయ స్థితిలో స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చిన అనిశెట్టి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని సరైన సమయంలో వైద్యం చేసి ప్రాణాలు కాపాడినట్టు ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ బేబీకమల గురువారం తెలిపారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన 45 ఏళ్ల అనిశెట్టి సుబ్రహ్మణ్యం ఈ నెల 18న తన ఇంటివద్ద స్పృహతప్పి పడిపోవడంతో బంధువులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి గుండె సంబంధిత సమస్యను గుర్తించారు. వెంటనే రూ.45 వేల విలువైన టెనెక్టెప్లేస్ 40 ఎంజీ అనే ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం లేకుండా కాపాడి వెంటనే విజయవాడ కార్డియాక్ సెంటర్‌కు పంపించినట్లు ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ సి.హెచ్. బేబీకమల తెలిపారు. ఖరీదైన ఇంజక్షన్‌ను పేదలకు ఉచితంగా అందజేస్తున్నట్టు ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాలివే..

ఏలూరురూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఏలూరు వన్ టౌన్‌లోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్ బజార్, కెనాల్ ఫీడర్ల పరిధిలో వైఎంహెచ్ఏ హాల్ నుంచి విద్యుత్ లైన్లు, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. రిక్షాపాటి, ఏడు గోలీల సెంటర్, సాంబారు పునుకుల సందు, వేణుగోపాలస్వామి టెంపుల్, విజయలక్ష్మీ థియేటర్, బుద్ధాపార్క్, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు, పెరుగుచెట్టు, బిర్లభవన్ సెంటర్, మార్కెట్ ఏరియా, పె రుగు చెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిసెట్టివారిపేట, నల్లదెబ్బ, మున్సిపల్ ఆఫీసు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

ఏలూరు రూరల్ మండల పరిధిలో..

తిమ్మరగూడెం, కోటేశ్వర దుర్గాపురం, పరిసర ప్రాంతాలకు, కొమడవోలు, చాటపర్రురోడ్డు హమాలీ కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రీ కాలనీ, చెంచుకాలనీ, ఆటో నగర్, తూర్పు లాకులు, సాయినగర్, ఎన్టీయార్ కాలనీ, మల్కాపురం, ఇందిరమ్మ కాలనీ, తూర్పు లాకులు, సాయినగర్, మాధవాపురం ఫీడెర్ పరిధిలోని పాలగూడెం, ఇందిరమ్మ కాలనీ ఏరియా లైన్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

భీమడోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు..

భీమడోలు: గుండుగొలను, భీమడోలు, సూరప్పగూడెం, పోలసానపల్లి, పాతూరు గ్రామాలకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

లింగపాలెం మండలంలో..

ఏలూరు: లింగపాలెం మండలంలోని రంగాపురం, ఆసన్నగూడెం, కె.గోకవరం, లింగ పాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

ఉంగుటూరు సెక్షన్ పరిధిలో..

ఉంగుటూరు:మండలంలోని సీతారాంపురం, రాచూరు, రావులపర్రు గ్రామాల పరిధిలోని చేపల చెరువులకు విద్యుత్ సరఫరాకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదు.

టి.నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలో..

టి.నర్సాపురం: టి.నర్సాపురం, మక్కినవారిగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జంగారెడ్డి గూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీపీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

మానవత వ్యవస్థాపక దినోత్సవం

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మానవత వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నారాయణపురంలోని ఉషోదయ హైస్కూలు విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. సెంట్రల్ కమిటీ డైరెక్టర్ సాగిరాజు జానకిరామ రాజు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మానవత మండలాధ్యక్షుడు కోనే సత్యనారాయణ, మండలి చైర్మన్ గుణ్ణం బుల్లెబ్బాయి, మండల కన్వీనర్ అడపా శ్రీను, కార్యదర్శి రాజాన సతీశ్, కోశాధికారి గంజి రవి, వేగేశ్న సూర్యనారాయణరాజు, బొమ్మిడి అప్పారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, సోలాపురి మూర్తి, ఎం.చిన అప్పారావు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా ఆపన్నులకు పలుసేవలు అందుతున్నాయని ఈ సేవలను మరింత విస్తరింపజేస్తామని సంస్థ అధ్యక్షుడు కె.నరసింహరావు పేర్కొన్నారు. మానవత శాంతి ర్యాలీ ద్వారకాతిరుమలలో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులు మానవహారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ జడ్పీటీసీ, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ మొగతడకల లక్ష్మీరమణి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సంస్థ సభ్యులు తూంపాటి పద్మవరప్రసాద్, దేవరపల్లి రాయుడు బాబు, పావులూరి మధు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘ మండలాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, కార్యదర్శి తుట్టగుంట మధు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం సోమశేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఎస్.ఐ. ఎస్‌కె.జబీర్, మాజీ మానవత అధ్యక్షుడు పి.ఏ.కృష్ణమూర్తి, త్రిపుర, ఆశీర్వాదం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టిన రోజు వేడుక

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వారోత్సవాల్లో భాగంగా గురువారం చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగా అభిమాని రామిశెట్టి కల్యాణ్ ఆధ్వర్యంలో సోమవరప్పాడు రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ మానసిక వికలాంగుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషులు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. 7వ రోజు సెయింట్ జోసెఫ్ మానసిక వికలాంగుల వసతి గృహంలో పిల్లలకు భోజనం, పండ్ల పంపిణీ చేశారు. ఏలూరు చిరంజీవి యువత అధ్యక్షులు శానం శ్రీరామకృష్ణ మూర్తి,మారం హనుమంతరావు(అను), ఈదుపల్లి పవన్, పి.జగన్, డి.పెదబాబు, కట్టా ఆది, సురేష్ మాస్టర్, నరేష్ దేవాబత్తుల అరవింద్, రోహిత్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సదస్సు విజయవంతమైందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏకైక లక్ష్యంతో శ్రీకాకుళంలో ఈ సదస్సును నిర్వహించమన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎల్‌టీసీలో కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐల్లో మిగిలి ఉన్న సీట్లను మూడోవిడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేసేందుకు అభ్యర్థులు ఈ నెల 26న సాయంత్రం 5గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ ప్రిన్సిపాల్ తెలిపారు. తమ కేంద్రంలో వెల్డర్ ట్రేడ్‌లో ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఫిర్యాదులొస్తే సహించం

కామవరపుకోట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సాగిపాడు పంచాయతీ కార్యదర్శి బి.బాలాజీ పేర్కొన్నారు. గురువారం సాగిపాడు సచివాలయం వద్ద సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాలని, పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ రెవెన్యూ పరిపాలన అధికారి కె.వెంకన్నబాబు, వెటర్నరీ అసిస్టెంట్ కె.జయరాం, ఏఎన్ఎం ఎం.రాధిక, డిజిటల్ అసిస్టెంట్ రాజ్‌కమల్, మహిళా సంరక్షణ అధికారి టి.బేబిరాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ సి.హెచ్.పుల్లారావు, ఉద్యాన శాఖ ఇన్‌చార్జి శ్రీరామ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎ.శివశంకర్ ఉన్నారు.

షిర్డీ సాయికి భక్తుల విశేష పూజలు



ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలోని ఆఖరి గురువారం కావడంతో ఆదివారపు పేటలోని శ్రీషిర్డీ సాయి ప్రేమ మందిర్ వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో జరిగిన పల్లకీ సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో మేళతాళాలతో సాయినామ సంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ సందడిగా నగర సంచారం జరపడం విశేషం.

ఎల్‌సీసీ భూముల్లో సాగు అడ్డగింత

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెంలో ఉన్న ఎల్‌సీసీ భూములను అదే గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు దున్నుతున్నారని అందిన సమాచారం మేరకు తహసీల్దార్ కె.స్లీవజోజి ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ సిబ్బంది పోలీసులతో పంగిడిగూడెం వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఎల్‌సీసీ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించినా, సాగు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు తెలియజేశారు.ఈ భూముల విషయమై తహసీల్దారు కె.స్లీవజోజి కలెక్టరుకు లేఖ రాశారని జిల్లా కలెక్టరు ఆదేశాలతో తదుపరి నిర్ణయం ఉంటుందన్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

చింతలపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాలనీకి సంబంధించిన విద్యార్థులు గురువారం సాయంత్రం యూనిఫాంలతో మునిసిపల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి తమ కాలనీ గోడు సమస్యలు విన్నవించారు. తమ కాలనీ రోడ్లు బాగోలేదని, డ్రెయినేజీలు రోడ్లపై పారి దోమలు ముసురుతున్నాయని, గతంలో ఎన్నిసార్లు విన్నవించినా, ధర్నాలు జరిపినా, ర్యాలీలు జరిపినా తమగోడు పట్టించుకోవడంలేదని విద్యార్థులు మొరపెట్టారు. సమస్యలపై మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆ కాలనీలో మట్టి రోడ్లు వేయించి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆలయానికి భూమి పూజ

బుట్టాయగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కామవరం గిరిజన గ్రామంలో నూతనంగా నిర్మించబోయే శ్రీగుబ్బల మంగమ్మతల్లి, నాగేంద్ర తల్లి, దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి గురువారం ఆలయ పీఠాధిపతి వర్షా పుల్లారావు, సుశీల దంపతుల చేత అర్చకులు మనోజ్ భూమిపూజ చేయించారు. వేదమంత్రాలు, హోమాలు నడుమ ఆలయ నిర్మాణ పనులు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు, ఆలయ కమిటీవారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ వారు మొడియం రమేశ్, కోర్స రాంబాబు, గురుగుంట్ల రవి, వర్స జితేందర్, గురుగుంట్ల వెంకమ్మ, పూనెం పాపమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక సాయం

పెదవేగి(దెందులూరు), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం సూర్యారావుపేటలోని ఒంటరి మహిళకు చేయూత సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న జెట్టి సత్యవతికి రూ.10 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. చేయూత సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున మరీదు లక్ష్మణరావు, వీరంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంఘ సేవకుడు తల్లాప్రగడ సుబ్బారావు కన్నుమూత



ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన సంఘ సేవకుడు, కళాభిమాని, హిందూ యువజన సంఘం సభ్యుడు, రోటేరియన్ తల్లాప్రగడ సుబ్బారావు(79) ఏలూరు పవర్‌పేటలోని ఆయన నివాసంలో మృతి చెందారు. సుబ్బారావు ఏలూరు నగరంలో సేవా ఆధ్యాత్మిక, కళా సంస్థలలో సభ్యుడిగా కొనసాగుతూ కళారంగానికి సమాజానికి సమాజంలో ప్రజలకు అనేక సేవలందించారు. సుబ్బారావు ఆకస్మిక మృతికి హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.సత్యనారాయణ, కానాల బాల వెంకట రమేశ్, ఇరదల ముద్దుకృష్ణ, మజ్జి సూర్యకాంతరావు, గాదంశెట్టి శ్రీనివాసరావులు సంతాపాన్ని ప్రకటించారు.

నేత్రపర్వంగా ఏకాదశ రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో గురువారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తులను అలరించింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ అభిషేకసేవ భక్తులకు కనువిందు అయ్యాయి. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ పాలు, పెరుగు, పంచదార, పళ్లరసాలు, తేనె తదితర దినుసులతో రుద్రాభిషేకాన్ని జరిపారు.

సీపీఐ సభలు జయప్రదం చేయండి

కొయ్యలగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహా సభలు విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆంజనేయరాజు కోరారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నాయన్నారు. ఈ సభలు విజయవంతం కావడానికి ప్రతీ ఒక్కరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రామకృష్ణ, వెలగానాని, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయంలో చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు కోటదిబ్బపై ఉన్న సచివాలయంలో దొంగలు పడి నగదును, సీపీయూ అపహరించుకుపోయారు. రికార్డులను చించివేశారు. ఏలూరు కోటదిబ్బపై ఉన్న సచివాలయ అడ్మిన్ ఇన్‌చార్జి ఇస్లావత్ నాగరాజు బుధవారం రాత్రి 8 గంటలకు తాళం వేసి గురువారం ఉదయం 9 గంటలకు వెళ్లగా తాళాలు బద్దలుకొట్టి ఉన్నాయి. సచివాలయం లోపల టేబుల్ సొరుగులోని రూ.4వేల నగదు, సీపీయూ అపహరించుకుపోయారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మదీనాబాష ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కల్తీ మద్యం కేసులో రిమాండ్

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నీళ్లతో మద్యాన్ని కల్తీ చేసి అమ్ముతున్న వారిని ఈ నెల 19న పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఫేక్ కంపెనీ బ్రాండ్ సీసా మూతలు సప్లై చేసిన మూడవ ముద్దాయిగా ఉన్న విజయవాడకు చెందిన ముల్లా మనోజ్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి పద్నాలుగు రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ కె.శ్రీనుబాబు గురువారం తెలిపారు.

పాఠశాలకు వితరణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హేలాపూరి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, దుశ్యంత్ చౌదరి ఆధ్వర్యంలో దొండపూడి ఎంపీపీ పాఠశాలకు నీటి శుద్ధి యంత్రం అందజేశారు. హెచ్ఎం కే.అరుణ ప్రసన్న, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు బీవీ.శ్రీనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ కే.జయలక్ష్మి పాల్గొన్నారు.

పందుల నిర్మూలనకు చర్యలు

కలిదిండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):యథేచ్ఛగా సంచరిస్తున్న పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని కలిదిండి పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం కలిదిండిలో సంచరిస్తున్న పందులను వలలతో పట్టించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య మెరుగుదలకు, పందుల నిర్మూలన చేపట్టామన్నారు. పందుల పెంపకం దారులు ఒక్కొక్క పందికి రూ.500 చెల్లించి పంచాయతీ నుంచి లైసెన్సు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా విచ్చలవిడిగా పందుల సంచరిస్తే వాటిని నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు.

7 నుంచి జిల్లా స్థాయి యోగాసన పోటీలు

ఆగిరిపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలోని కస్తూరి కళ్యాణ మండపంలో సెప్టెంబరు 7వ తేదీ నుంచి జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తామని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు తెలిపారు. యోగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 94903 35122, 91334 02255, 99851 93890 నంబర్లలో సంప్రదించాలన్నారు.



ఉప్పుటేరు రైల్వేబ్రిడ్జి వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్

ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యం వద్దు

» ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న ఆక్రమణల తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరులో ఆక్రమణల తొలగింపు, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్‌తో కలిసి పరిశీలించారు. ఉప్పుటేరుపై ఉన్న రైల్వేబిడ్జికి ఎగువన దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడుపై మనుషులు నడిచి వెళ్లడం చూసి అవాక్కయ్యారు. పూర్తిస్థాయిలో తొలగింపునకు మరిన్ని యంత్రాలను వినియోగించాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఒక్క గ్రామం కూడా ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకుంటానన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుతో కలిసి పనులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు, పెన్మెత్స త్రినాధరాజు, కొల్లి వరప్రసాద్, డీఈ వినోద్, అధికారులు పాల్గొన్నారు.

'చెరువుల గండ్లు పూడ్చితే చర్యలు తప్పవు'

కలిదిండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి అక్రమ చేపల, రొయ్యల చెరువుల గండ్లను పూడ్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆర్డీవో అచ్యుత అంబరీష్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన 'అలా గండ్లు కొడితే.. ఇలా పూడ్చేస్తున్నారు' అనే శీర్షిక కథనానికి అధికారులు స్పందించారు. గురువారం చినతాడినాడలో ఉప్పుటేరు వెంబడి అక్రమ చెరువుల తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఆరు ఎక్స్‌కవేటర్లు పని చేస్తున్నాయని, మరో రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి ఉప్పుటేరు ఇరుపక్కల నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెరువులను తొలగిస్తామన్నారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు స్కొరా అరవింద్, సంగాని గంగాధరరావు, రామరాజు, తహసీల్దార్ రామకృష్ణ, డ్రెయినేజీ ఏఈఈ జయప్రకాష్, ఆర్ఐ శ్యామల, వీఆర్వో గంగాధరరావు పాల్గొన్నారు.

25న మహాధర్నాను విజయవంతం చేయాలి

కైకలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 25న పాత పెన్షన్ సాధన కోసం ఉపాధ్యాయులు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా ఫోరం మహిళా కన్వీనర్ రమీజున్నీసా, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యదర్శి వి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాధర్నా పోస్టర్‌ను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2003 డీఎస్సీలో ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవిశంకర్, కైకలూరు అధ్యక్షుడు దండే బెనర్జీ, యూటీఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, సనావుల్లా నాగకల్యాణి, సలీమాభేగం, హుస్సేన్, అబ్దుల్ సత్తార్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

పింఛన్ల తొలగింపుపై దివ్యాంగుల ధర్నా

ఆగిరిపల్లి/ముసునూరు, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని మండల వికలాంగుల పింఛన్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.యాకోబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల పెన్షన్‌దారులు గురువారం ధర్నా చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ తొలగిస్తూ నోటీసులు అందించడం అన్యాయం అన్నారు. అధికారులు తొలగించిన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల ఏవో అబ్దుల్‌సలాంకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సీపీఎం నాయకులు, సత్తు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ముసునూరు మండలం మండల కార్యాలయం వద్ద దివ్యాగుల పింఛన్లను పునరుద్ధరించాలని బాధితులు ఆందోళన చేశారు. తమ అంగవైకల్యాన్ని ప్రభుత్వం మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత ఉంటే పెన్షన్‌ను పునరుద్ధరించాలని వారు కోరారు. అనంతరం ఎంపీడీవో బీవీ సత్యనారాయణకు తమ గోడు విన్నవించుకుని, పరిశీలనకు దరఖాస్తులు అందజేశారు.

కొత్త ముహూర్తం !


(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్ల విషయంలో వీలైతే వచ్చే జనవరిలో సంక్రాంతికి ముందుగా గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం పరిధిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగానే నిలిచాయి. ఏలూరులో 2,200 ఇళ్లకుపైగా నివాసానికి అనువుగా ఐదేళ్ల క్రితమే సిద్ధమయ్యాయి. ఇవన్నీ సాంకేతిక ఆటంకాలు.. అధిగమించిన తర్వాత గృహ ప్రవేశాలకు అనువుగా కీలక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

జల దిగ్బంధం

(5వ పేజీ తరువాయి)

మునిగాయి. ఏటిగట్టుకు కుడి వైపున కడెమ్మ కాలువ జలాలు, కొండ వాగు ల జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంట పొలాలు నీటమునిగాయి.



పెద్దఎడ్లగాడి వద్ద నిలకడగా కొల్లేరు

నిలకడగా కొల్లేరు

కైకలూరు : కొల్లేరు ఉధృతి గురువారం కొద్ది మేరకు తగ్గి నిలకడగా ప్రవహించడంతో రహదారులు కొద్దికొద్దీగా కోలుకుంటున్నాయి. మండవల్లి మండలం పెనుమాకలంక రహదారిపై నాలుగు అడుగుల మేర ప్రవహించిన నీరు రెండు అడుగులకు తగ్గింది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతి తగ్గింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కైకలూరులో హైవే ధ్వంసం..

కైకలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి... వేలాది మంది ప్రజలు, విద్యార్థులు నిత్యం ప్రయాణించే రహదారి ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోకపోవడంతో గుంతల రోడ్డుమీదే అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. కైకలూరులోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే గేటు వరకు ఈ దుస్థితి నెలకొంది. 165వ జాతీయ రహదారి అయినప్పటికీ ఏడేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రహదారిపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం వల్ల కొద్దిరోజులకే గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టూ ఖాళీ ప్రదేశం ఉన్నప్పటికీ వర్షపునీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రహదారి ముంపునకు గురై ధ్వంసమవుతుంది. ఇప్పటికైనా అధికారులు పక్కా రహదారి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కోడూరు గ్రామ రహదారి అభివృద్ధిని పాలకులు, అధికారులు గాలికొదిలేశారు. ఒక్క రోజు వర్షం కురిస్తే వారం రోజుల వరకు గ్రామం నుంచి ఆ రోడ్డుపై కాలుమోపే అవకాశం లేదు. ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారి నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడూరు గ్రామ వాసులు అధ్వానపు రోడ్డుపై అవస్థలు పడుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



చెరువులను తలపిస్తున్న మూల్లంక - పెదలంక రహదారి

కలిదిండి : కలిదిండి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. మూల్లంక - పెదలంక ప్రధాన రహదారి పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉంది. బస్సుల రాకపోకలను నిలుపుదల చేశారు. పోతుమర్రు - కలిదిండి ప్రధాన రహదారిపై పడిన గుంతల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు గుంతల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఆరుతెగల పాడు - కాళ్లపాలెం, కొండూరు - తాడినాడ ప్రధాన రహదారి పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉంది.

పెనుమాకలంక రోడ్డు అధ్వానం



పెనుమాకలంక-ఇంగిలిపాకలంక రోడ్డు

మండవల్లి: ఇంగిలిపాక-పెనుమాకలంక ఆర్ అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. కొల్లేరు పర్యావరణ పరిధి అంటూ రహదారి అభివృద్ధిని అటవీశాఖ అధికారులు పదేపదే అడ్డుకోవడంతో రోడ్డుపై కాలినడకన నడిచేందుకు అవకాశం లేకుండా అధ్వానంగా మారింది తారురోడ్డు కాస్త మట్టిరోడ్డుగా మారినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గత జగన్ ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి రూ.7కోట్లు కేటాయించినప్పటికీ శిలాఫలకం అలంకారంగా కనిపిస్తోంది తప్ప నిర్మాణ పనులు చేపట్టలేదు.



కైకలూరులో ప్రభుత్వ విద్యాసంస్థల వద్ద ధ్వంసమైన జాతీయ రహదారి

రోడ్లు నరకప్రాయం

ఇటీవల వర్షాలకు రహదారులు గుంతలమయం

రహదారులు గోతులమయం అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులకు మరమ్మతులు నిర్వహించి గోతులు పూడ్చినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు యథావిధిగా రోడ్ల గుంతలమయంగా మారాయి. గురువారం రహదారుల పరిస్థితిపై ఆంధ్రజ్యోతి విజిట్ చేసిన సందర్భంగా రోడ్ల దుస్థితిపై ప్రత్యేక కథనం.



సింహాద్రిపురం వద్ద రహదారి దుస్థితి

ఏలూరు వెళ్లే రహదారి అధ్వానం

ముసునూరు: నూజివీడు నుంచి సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల గ్రామాల మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ ఈ రహదారి అభివృద్ధికి రూ.47.18 కోట్లు నిధులు మంజూరు చేసి, కొంతమేర మార్జిన్ కంకర వేసిన పనులను మాత్రమే పూర్తిచేసిన అనంతరం బిల్లులు చెల్లింపులో జాప్యం జరగడంతో కాంట్రాక్టర్ పనులను నిపివేసి మూడున్నరేళ్లయింది. అడుగడుగున గుంతలమయంగా మారడంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవు తున్నారు. ఈ రహదారి అభివృద్ధిపై మంత్రి పార్థసారథికి ప్రజలు, నాయకులు మొర పెట్టుకున్నప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైన ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



చాట్రాయి పాత పోస్టాఫీస్ వద్ద రోడ్డు

చాట్రాయి-బూరుగుగూడెం రోడ్డు గోతులమయం

చాట్రాయి : చిత్తపూరు-బూరుగుగూడెం ఆర్అండ్‌బీ రహదారి పరిధిలో చాట్రాయి సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు రోడ్డుకు పెద్ద గోతులు పడి వర్షం నీరు నిలిచి ప్రజలు, వాహనచోదకులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. చాట్రాయి గ్రామ పరిధిలో గ్రోమోర్ సెంటర్, పాత పోస్టాఫీస్, విజయ పాల కేంద్రం, వికాస్ స్కూల్ మొదలైన చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. మంత్రి కొలుసు పార్థసారథి ఆరు నెలల క్రితం నియోజకవర్గ స్థాయిలో గుంతల రహిత రహదారుల పథకాన్ని ఇక్కడే ప్రారంభించారు. ఆ రోజు మాత్రమే అధికారులు ఈ రోడ్డులో అరకొరగా గుంతలు పూడ్చారు. చాట్రాయి సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు 600 మీటర్లు సీసీ రోడ్డు, అక్కడ నుంచి బూరుగుగూడెం వరకు 1.90 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి చొరవతో నిధులు మంజూరై నాలుగు నెలల క్రితం టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ కొత్త రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

ఆర్అండ్‌బీ రహదారులు ధ్వంసం



నూజివీడు పోతిరెడ్డిపల్లి రహదారి

నూజివీడు టౌన్ : నూజివీడు బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బైపాస్ వరకు రహదారి పలు ప్రాంతాలలో ధ్వంసమైంది. అధికారులు కనీసం దృష్టి సారించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది భారీ వర్షాలకు నూజివీడు నుంచి పోతురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద చెరువు కళంగి వాగుపై ఉన్న వంతెన వద్ద రహదారి పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మత్తులు చేస్తామని అధికారులు చెప్పిన ఆ రహదారి మరమ్మతులు పూర్తికాలేదు. మరోవైపు దసరాకు ప్రసిద్ధిగాంచిన నూజివీడుకు మరో రెండు నెలల్లో దసరా పండుగ సమీపిస్తుండడంతో రహదారులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మురుగునీళ్లతో పెరికేగూడెం గ్రామస్థుల నిరసన

ఆ మురుగునీటిని తాగలేం

పెరికేగూడెం గ్రామస్థుల నిరసన

మండవల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెరికేగూడెంలో పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన రక్షితనీటి పథకం ద్వారా మురుగునీరు వస్తుండడంతో గ్రామస్థులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రామంలో సుమారు మూడు వేల మంది జనాభా ఉన్నారు. వారికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు గురువారం గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ నీరు తాగలేమని వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని కార్యదర్శి రాధికను నిలదీశారు. నీళ్ల కుండీలో కుక్క చనిపోయి రోజులు గడుస్తున్నా ట్యాంక్ వాచర్ తీయలేదని, ఆ నీటినే నాలుగు రోజులుగా తాగుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ట్యాంక్ వాచర్‌పై చర్యలు తీసుకుంటామని కార్యదర్శి అన్నారు.

చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కైకలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో చైన్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని కైకలూరుటౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. గురువారం కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో కేసు వివరాలను వెల్లడించారు. వేమవరప్పాడు గ్రామానికి చెందిన బోడావుల గంగా మహాలక్ష్మి కోరుకొల్లు రోడ్డులో వెళుతుండగా ఈనెల 15వ తేదీన ద్విచక్రవాహనంపై ఓ గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి మెడలోని మూడు కాసుల బంగారు చైన్ దొంగతనం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ఎస్ఐ శ్రీను మరో ముగ్గురు కానిస్టేబుళ్లతో కలిసి కేసు విచారణ చేశారు. గురువారం కైకలూరు-కోరుకొల్లు రోడ్డులోని ఆచవరం రైల్వేగేటు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా యువకుడు వేమవరప్పాడు గ్రామానికి చెందిన బొడ్డు మోజేష్‌గా గుర్తించడమే గాక చోరీకి పాల్పడిన నిందితుడిగా కనుగొన్నారు. అతడిపై కేసు నమోదు చేసి మూడు కాసుల బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్రీను, సిబ్బంది పి.దుర్గాప్రసాద్, కె.నాగార్జున, పి.రాములును డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అభినందించారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

చాట్రాయి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.17,200 నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీసే జూద క్రీడలను ప్రోత్సహించినా పాల్గొన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల విస్తృత తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆగిరిపల్లి, శోభనాపురం గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పౌర సరఫరాలశాఖ అధికారులు

నూజివీడు, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి) : 'మామిడి తోటలో రేషన్ బియ్యం దందా' అంటూ ఆగిరిపల్లి మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి సివిల్ సప్లై, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా స్పందించారు. ఆగిరిపల్లి మండలంలోని ఆగిరిపల్లి, శోభనాపురం గ్రామాలలో ఉన్న మామిడి తోటల్లోని రేషన్ దుకాణాలలో విస్తృతంగా తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా శోభనాపురం గ్రామంలో మామిడి తోటలో దాదాపు వంద లారీల బియ్యం పట్టే రెండు భారీ షెడ్లు దర్శనం ఇవ్వగా షెడ్లులో తనిఖీలను నిర్వహించారు. అక్రమ బియ్యం రవాణా ప్రతినెలా 15వ తేదీ నాటికి పూర్తవుతుందని ఆంధ్రజ్యోతి కథనంలోనే పేర్కొంది. ఈనేపథ్యంలో సదరు షెడ్లలో ఎటువంటి బియ్యం అధికారులకు దొరకలేదు. గ్రామంలోని రేషన్ దుకాణాలను పరిశీలించిన సివిల్ సప్లై అధికారులు వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద రేషన్ బియ్యం ఇవ్వాలని రేషన్ దుకాణాదారులను ఆదేశించారు. ఈ దాడుల్లో నూజివీడు పెదపాడు సీఎస్డీటీలు వెంకటేశ్వరరావు, సునీత, నిడమర్రు, చింతలపూడి సీఎస్‌లు జరీనా, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అయితే నూజివీడు నియోజకవర్గం నుంచి ఎన్టీయార్ జిల్లాలో గల రైస్ మిల్లులకు భారీ స్థాయిలో రేషన్ బియ్యం సరఫరా అవుతుందని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రతీనెల తొలి అర్ధభాగంలో నిఘాను ఉంచితే నియోజకవర్గంలో అనేక ప్రాంతాలలో అక్రమంగా నిల్వ ఉంచిన రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడుతుంది అనడంలో సందేహం లేదు. మరి పౌరసరఫరాల శాఖ అధికారులు ఏం చేస్తారో వేచి చూడాలి.



ముదినేపల్లిలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు

జీతాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్ల నిరసన

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచాలని, సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.సుజాత డిమాండ్ చేశారు. గురువారం కైకలూరు తాలుకా సెంటర్లో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం నల్లదుస్తులు ధరించి నిరసన చేస్తూ మానవహారం చేపట్టారు. యూనియన్ నాయకులు ఎల్ మీనాకుమారి, ఝాన్సీ, విజిత, మునీంద్ర, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం మండవల్లి ప్రధాన సెంటర్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాట్యూటీ జీవోలు మార్పులు చేసి ఇవ్వాలని, గ్యాస్ ఇతర బకాయిలు చెల్లించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ముదినేపల్లి మండలం ముదినేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు గురువారం మానవహారం నిర్వహించారు. మండలంలోని 91 అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు సీఐటీయూ కైకలూరు ప్రాజెక్టు ఏరియా అధ్యక్షురాలు చెల్లమ్మ, మండలశాఖ అధ్యక్షురాలు సూరపనేని అరుణకుమారి, నాయకులు బండి పద్మ, రిప్కామణి ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు.

● నూజివీడు టౌన్/ముసునూరు : నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో సీఐటీ యూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. ఎంఆర్ హనుమాన్లు, ఆదిలక్ష్మి, మణి, అరుణ ప్రసన్న, విజయలక్ష్మి, పద్మ, భవాని పాల్గొన్నారు. ముసునూరు మండలం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు ఆందోళన నిర్వహించి, తహసీల్దార్ ప్రశాంతికి వినతపత్రం అందజేశారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

ముదినేపల్లి,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో కొందరు యువకుల మధ్య ఏర్పడిన వివాదం దాడికి దారితీసి ఓ యువకుడి తల పగిలింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. వైఎస్ఆర్ కాలనీకి చెందిన కేశవ, గుణ, హేమంత్, పవన్ అనే యువకులు ఈ నెల 18వ తేదీ రాత్రి ఒక విషయమై మాట్లాడుకుంటుండగా అక్కడికి అదే కాలనీకి చెందిన గంజి గంగరాజు వెళ్లారు. ఆ యువకులు మాట్లాడే విషయంలో అతడు జోక్యం చేసుకుని ఎందుకు అలా మాట్లాడుతున్నారని వారించాడు. ఆ వివాదం అక్కడికి సర్దుమణిగింది. అనంతరం ఈనెల 19వ తేదీ రాత్రి గంగరాజు ముదినేపల్లిలోని ఓ బ్రాందీ షాపు వద్ద ఉండగా ఆ యువకులు మరికొంత మంది సహకారంతో బీరుబాటిల్‌తో తలపై కొట్టారు. ఈమేరకు అతడి తల పగిలి తీవ్ర గాయాలు కాగా వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి గురువారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.



ఫణీంద్రను సత్కరిస్తున్న రైతులు

ఉత్తమ పశువైద్యాధికారి ఫణీంద్రకు ఘన సత్కారం

కలిదిండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు పశువైద్యశాలలో వైద్యాధికారిగా పనిచేస్తున్న నున్న ఫణీంద్ర ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా రైతులు సన్మానించారు. గురువారం పశువైద్యశాలలో గురువారం రైతులు ఘనంగా సత్కరించారు. రైతులు నున్న సుబ్రహ్మణ్యం, తోట రామాంజనేయులు, చేబోయిన శ్రీనివాసరావు, బోడావుల విజయరాజు, ఎం.విష్ణు పాల్గొన్నారు.

ఫారెస్ట్ సిబ్బందిపై దాడి తగదు

నూజివీడు, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేయడాన్ని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజమండ్రి సర్కిల్ అధ్యక్షులు, నూజివీడు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ ఫారెస్టు అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిత్యం అడవుల పరిరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అటవీ సంరక్షణ ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తుంటే ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడులను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు.

'పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం'

ముసునూరు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. లోపూడి గ్రామానికి చెందిన పేరం మహేష్ బాబు పుట్టిన నాటి నుంచి కిడ్నీ పెరుగుదల లేకపోవండతో అతడికి తల్లి ఇస్తున్న కిడ్నీ ఆపరేషన్‌కు నిమిత్తం రూ.3.5 లక్షల విలువగల ఎల్‌వోసీ చెక్కును గురువారం బాధిత కుటుంబానికి మంత్రి అందజేశారు. టీడీపీ నాయకులు లక్కపాము కాంతారావు, పేరం గంగరాజు, నక్క చెన్నారావు, పేరం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ముసునూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడు ఎంపీపీ, జడ్పీ పాఠశాలల్లో శక్తి టీమ్ ఆధ్వర్యంలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై గురువారం ఏఎస్ఐ పణిభూష ణరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలు పట్ల జరుగుతున్న అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.